ప్రజాశక్తి
ఆదివారం 21 జనవరి 2024    8 పేజీలు

గుంటూరు    పల్నాడు

# పల్నాడులో పెరిగిన పులుల సంచారం

## విద్యుత్ తీగలు తగిలి ఒక పులి దుర్మరణం

## ముందస్తుగా గుర్తింపులో అటవీ అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లాలో పెద్దపులుల సంచారం పెరిగింది. ఇటీవల దాచేపల్లి మండలం బట్రుపాలెం గ్రామ పొలాల మధ్య చిరుతపులి సంచారం జరిగినట్టు అధికారులు కనుగొన్నారు. అలాగే గతనెల 17న పెద్దపులి వెల్దుర్తి మండలం పిచ్చయ్యబావి తండా సమీపంలో పొలానికి పెట్టిన విద్యుత్ వైర్లు తగిలి దుర్మరణం పాలైన ఘటన అటవీశాఖలో కలకలం రేపింది. ఈ ఘటనపై ఉన్నతాధికారులు దర్యాప్తునకు ఆదేశించారు. ఈ ఘటనలో 14 మందిని ఇప్పటివరకు అధికారులు అరెస్టు చేశారు. నాగార్జునసాగర్ మార్కాపురం వన్యప్రాణి విభాగ అటవీ ప్రాంతంలో ఒక పెద్ద పులి రెండు పులి పిల్లలు తిరుగుతున్నాయని అధికారులు వాటి పాదముద్రల ద్వారా గుర్తించారు. రెండు పిల్లలలో ఒక పిల్ల కొండపై నుండి పడి చనిపోయినట్లుగా తెలిసింది.

రెండో పిల్ల తల్లి నుండి విడిపోయి తన వేట ప్రదేశాన్ని వెతుకులాడు కొనే ప్రయత్నంలో భాగంగా గతనెలలో పిచ్చయ్యభావితండాలో విద్యుత్ తీగల కు తగిలి చనిపోయినట్లుగా అధికారులు చెబుతున్నారు అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో ఈ పులి పిల్ల కనిపించడం లేదని పిచ్చయ్య తండాలో ప్రమాదంతోఈ పులి మృతి చెందినట్టు నిర్ధారణకు వచ్చినట్లుగా అధికారులు అభిప్రాయ పడుతున్నారు. నల్లమడ వన్య ప్రాణి అటవీ ప్రాంతం లో టైగర్ ప్రాజెక్టు కింద మొత్తం నాలుగు చిరుతలు, రెండు పెద్దపులులు సంచరి స్తున్నట్టుగా అధికారులు ఇటీవల నిర్వహించిన సర్వేలో వెల్లడయినట్టు తెలిసింది.

అయితే అటవీ ప్రాంతంలో ప్రకాశం, నంద్యాల, కర్నూలు, నల్గొండ, పల్నాడు జిల్లాల పరిధిలో ఉండటం వల్ల ఏ ప్రాంతం నుంచి ఏ ప్రాంతానికి ఇవి వెళ్తున్నాయన్నదీ గుర్తించడంతో జాప్యం జరగడం వల్ల కొన్ని గ్రామాల సరిహద్దులోకి వస్తున్నాయని చెబుతున్నారు. అటవీ గ్రామాల సరిహద్దుల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసినా ఇంకా పూర్తిగా అవిపనిచేయడంలేదని తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఇటీవల పిచ్చయ్య బావి తండాలో విద్యుత్ తీగలకు తగిలిన పులి కూడా మృతిచెందింది. అయితే పులి చనిపోయిందని తెలుసుకున్న పిచ్చయ్యబావి తండా వాసులు భయంతో పులిమృతదేహాన్ని కొండ ప్రాంతానికి తీసుకువెళ్లి దగ్ధం చేశారు. తరువాత అటవీశాఖ అధికారులకు సమాచారం అంది మృత కళేబరాన్ని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపగా మృతి చెందిన జంతువు పులిగా గుర్తించారు. దీంతో అందుకు బాధ్యులైన వారిని అరెస్టుచేశారు. అయితే గత నెల రోజులుగా ఈ అంశంపై అత్యంత గోప్యత పాటించిన అటవీశాఖ అధికారులు రాజకీయ వత్తిడిని అధిగమించి పిచ్చయ్య బావి తండా వాసులను అరెస్టు చేశారు. కేంద్ర వన్యప్రాణి చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈచట్టం అత్యంత కీలకం కావడంతో ఈ నేరం రుజువు అయితే వీరికి ఏడేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

## లోన్ యాప్ వేధింపులు తాళలేక బిటెక్ విద్యార్థి ఆత్మహత్య

▶ వార్త మెయిన్‌లో

# పసుపు రైతుల ఆశలు గల్లంతు

## సరుకు రక్షించుకోవడానికి వెళ్లిన 11 మందికి గాయాలు

## కోల్డ్‌స్టోరేజ్‌లో అదుపులోకి వచ్చిన మంటలు - పూర్తిగా దగ్ధమైన పసుపు

ప్రజాశక్తి-దుగ్గిరాల

స్థానిక శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ లో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో నిల్వ ఉన్న పసుపు మొత్తం పూర్తిగా దగ్ధమైనది. శుక్రవారం జరిగిన ఈ సంఘటన లో శనివారం సాయంత్రం వరకు మంటలు ఆర్పే కార్యక్రమం కొనసాగుతూనే ఉన్నది. దీంతో కొంతమేరకైనా పసుపు మిగులుతుందని ఆశించిన రైతులు, వ్యాపారస్తుల ఆశలు గల్లంతు అయ్యాయి. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన రైతులు తాము నిల్వ చేసిన పసుపు వివరాల కోసం ప్రయత్నించారు. కానీ పోలీసులు ఆ ప్రాంతాన్ని ఎవ్వరిని రానీయకుండా నివారించారు. సంఘటనను పరిశీలించిన జెసి రాజకుమారి కి అగ్నిమాపక శాఖ అధికారులు కోల్డ్ స్టోరేజ్ పూర్తిగా కుప్పకూలే అవకాశాలు ఉన్నాయని వివరించారు. అంతేగాక కోల్డ్ స్టోరేజ్‌లో అమ్మోనియా లిక్విడ్ ఉన్నదని తెలిపారు. దీనితో ఆమె ఈ ప్రాంతాన్ని నో మెన్ జోన్‌గా ప్రకటించారు. ఆ పరిసర ప్రాంతాలకు ఎవరిని వెళ్లనివ్వకుండా నిలిపివేస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి సరుకు నిల్వ ఉంచిన ఒక వ్యాపారస్తుడు కోల్డ్ స్టోరేజ్ తలుపులు పగల గొట్టడానికి ప్రయత్నించగా ఒక్కసారిగా మంటలు బయటకు దూసుకు వచ్చాయి. దీనితో అగ్నిమాపక దళ రీజనల్ ఆఫీసర్‌తో సహా మరో ఇద్దరు అధికారులు మరో ఉద్యోగి నలుగురు సిబ్బంది

▶ 2లో

కోల్డ్ స్టోరేజ్ లో నిల్వ ఉంచిన పసుపు వివరాల పత్రాలు చూపుతున్న రైతులు

## నేడు విజయవాడలో లెనిన్ శత వర్ధంతి సభ

▶ 2లో

## ప్రశ్నిస్తే పోలీసులతో దాడి

### మహేష్‌పై దాడిని ఖండించిన సిపిఎం

▶ 2లో

మహేష్‌కు క్షమాపణ చెబుతున్న సిడిపిఒ శ్రీలత

## దిగివచ్చిన సిడిపిఒ

### సిఐటియు నాయకులు మహేష్‌కు క్షమాపణ

### సిడిపిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ధర్నా

గుంటూరులో రాస్తారోకో చేస్తున్న వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు

నరసరావుపేటలో ప్రజాసంఘాల ర్యాలీలో పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ తదితరులు

# బెదిరింపులు వీడి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

## ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకోలు - ఆందోళనలు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

**అంగన్‌వాడీల సమ్మె 40వ రోజుకు చేరుకున్న సందర్భంగా, విజయవాడలో నిరవధిక నిరాహార దీక్షలకు మద్దతుగా ప్రభుత్వ మొండి వైఖరిని నిరశిస్తూ కార్మిక, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు శనివారం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రాస్తారోకోలు, ఆందోళనలు చేపట్టారు.**

గుంటూరులో స్థానిక శంకర్ విలాస్ సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. తొలుత అంబేద్కర్ సెంటర్ నుండి శంకర్‌విలాస్ సెంటర్ వరకూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి.రాధాకృష్ణమూర్తి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే.శ్రీనివాసరావు, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు గనిరాజు మాట్లాడుతూ ప్రభుత్వ హామీ ప్రకారం వేతనాలు పెంచాలని, రిటైర్మెంట్ బెన్ఫిట్స్, పెన్షన్ తదితర సదుపాయాలు కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేయకుండా సమ్మె విరమింప చేయటానికి అన్ని ప్రయత్నాలూ చేసి విఫలం అయ్యిందన్నారు. ప్రభుత్వ నిర్బంధాన్ని సహించేది లేదని, అంగన్‌వాడీలకు అన్ని సంఘాలు అండగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమానికి ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షులు ఎ.అరుణ కుమార్, సిఐటియు నగర పశ్చిమ కమిటీ అధ్యక్షులు భగాతి సత్యనారాయణ, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మేడ హను మంతురావు, నగర కార్యదర్శి అంజిబాబు, సిఐటియు తూర్పు కమిటీ ఉపాధ్యక్షులు దీవెనరావు, పి.శ్రీనివాసరావు, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ చిష్టి, భాష, ఐద్వా జిల్లా, నగర కార్యదర్శి ఎల్ అరుణ, కళ్యాణి, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కృష్ణ కాంత్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అధికారంలోకి వచ్చాక రూ. వెయ్యి మాత్రమే వేతనం పెంచి ప్రస్తుతం ఇస్తున్న మొత్తం తామే పెంచినట్లు ప్రభుత్వం అసత్య ప్రచారాలకు తెరలేపిందని

▶ 2లో

## పసువు రైతుల ఆశలు గల్లంతు

(మొదటిపేజీ తరువాయి)

కోల్డ్ స్టోరేజ్ యజమానితో బాటు మొత్తం 11 మందికి గాయాలయ్యాయి. వీరు తాడేపల్లి మణిపాల్ ఆసుపత్రి మంగళగిరి ఎన్ఆర్ఐ ఆసుపత్రి గుంటూరు రమేష్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారని, ఎవరికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. దుగ్గిరాల గ్రామానికి చెందిన గుండి మెడ జీవన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారికి చికిత్స అందించ డంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ తెలిపారు. కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాదానికి గురైందని తెలిసిన వెంటనే సుదూర ప్రాంతాల నుండి రైతులు ఎంతో ఆతృతగా దుగ్గిరాల చేరుకున్నారు. బీమా కంపెనీ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ ప్రారంభించారు. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లా డారు. బీమా మొత్తం త్వరగా అందేటట్లు చూస్తామని భరోసా ఇచ్చారు.

ఈ సందర్భంగా కొల్లూరు మంలం కిష్కింపాలెంకి చెందిన బాధిత రైతు నరేంద్ర కుమార్ మాట్లాడుతు 2016 నుండి 2019 వరకు 2500 బస్తాలు సుమారు 1800 క్వింటాళ్లు నిలువ చేసినట్లు తెలిపారు. ప్రస్తుత ధరల ప్రకారం రెండు కోట్ల రూపాయలు విలువ ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగం స్పందించి నష్టం లేకుండా చూడాలన్నారు.

కృష్ణాజిల్లా మోపిదేవికి చెందిన గద్దె శ్రీనివాస్ మాట్లాడుతు పోలీసులు తమకు కోల్డ్ స్టోరేజ్ దగ్గరకు వెళ్లనివ్వడం లేదన్నారు. అధికారుల నుండి ఎటువంటి సమాచారం లేదని, బీమా సొమ్ము మా దగ్గర నుండి వసూలు చేశారు. ప్రభుత్వానికి చెల్లిస్తున్నారు లేనిది తెలియదన్నారు. సమాచారం తెలిపితే కొంతమేర ఉపశమనం ఉంటుందని వాపోయారు.

## ఆర్టీసిలో డయల్ యువర్ డిపిటిఒ

**ప్రజాశక్తి-గుంటూరు**

ఫోన్‌లో ఫిర్యాదులు తెలుసుకుంటున్న డిపిటిఒ రవికాంత్

జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.రవికాంత్ శనివారం ఆర్టీసి బస్టాండ్‌లోని తన కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటల నుండి 1 గంట వరకూ డయల్ యువర్ డిపిటిఒ కార్యక్రమం నిర్వహించి, ప్రయాణికుల నుండి ఫోన్ ద్వారా ఫిర్యాదులు, సలహాలు స్వీకరించారు. నల్లపాడులో బస్‌బేలో బస్సులు ఆపకపోవటం వల్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందని విజయకృష్ణ ఫిర్యాదు చేశారు. ప్రత్తిపాడు, పర్చూరు నుండి గుంటూరు వచ్చే బస్సులు నల్లచెరువు వద్ద ప్రయాణికుల్ని ఎక్కించుకోవాలని ఆసిఫ్ కోరారు. జూపూడి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని పవన్ కోరారు. ఆయా ఫిర్యాదులపై సంబంధిత అధికారులకు జిల్లా ప్రజారవాణా అధికారి తగు సూచనలు చేశారు.

దుకాణాలలో తనిఖీలు చేస్తున్న అధికారులు, సిబ్బంది

## పొగాకు నియంత్రణ చట్టం నిబంధనలు పాటించాలి

**ప్రజాశక్తి-గుంటూరు**

జాతీయ పొగాను నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధ్వర్యంలో శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో షాపులు తనిఖీలు చేపట్టారు. బహిరంగ ప్రదేశాల్లో, నిషేధిత ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల ఆవరణలో ధూమపానం చేయటం, పొగాకు ఉత్పత్తుల విక్రయాలు వాటికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పొగాకు నియంత్రణ లీగల్ అడ్వైజర్ పి.శివశంకర్ మాట్లాడుతూ జాతీయ పొగాకు నియంత్రణ చట్టం సిఒటిపిఎ-2023 నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎ.శ్రావణబాబు మాట్లాడుతూ పొగాకు, వాటి ఉత్పత్తులు వాడటం వల్ల కలిగే దుష్ప్రభావాలు వివరిస్తూ ఈచట్టాన్ని కఠినంగా అమలు చేయటం జరుగుతుందన్నారు. దుకాణాల ముందు నో స్మోకింగ్ బోర్డులు ఉంచాలని విక్రేతలకు తెలియజేశారు. కార్యక్రమంలో నందిగం సురేష్, సైకాలజిస్ట్ జ్యోతి, కొత్తపేట పోలీసులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు విజయవాడలో లెనిన్ శత వర్ధంతి సభ

**ప్రజాశక్తి - విజయవాడ**

సోషలిస్ట్ వ్యవస్థ రూపశిల్పి, ప్రపంచ మానవాళికి మార్గదర్శి వి.ఐ.లెనిన్ శత వర్ధంతి సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు సభ జరుగుతుంది. వి.ఐ.లెనిన్ శత వర్ధంతి నిర్వహణ కమిటీ, ప్రజాశక్తి - విశాలాంధ్ర ప్రచురణ సంస్థల ఆధ్వర్యాన గవర్నరుపేట లెనిన్ సెంటరులోని విగ్రహం వద్ద జరిగే ఈ సభలో పలువురు వామపక్షాల నేతలు పాల్గొంటారు. కమ్యూనిస్టు పార్టీల సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయో భిలాషులు ఈ సభలో పాల్గొని విజయవంతం చేయాలని సభ నిర్వాహకులు కోరారు.

# గ్రామపంచాయతీలకునిధుల విడుదల

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

రాష్ట్రవ్యాప్తంగా 2022-2023వ ఆర్థిక సంఘం నిధులు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గ్రామపంచాయతీలకి రూ. 41 కోట్లు విడుదల అయ్యాయి. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈనిధులకు జమకావడంపై సర్పంచ్‌ల సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలకలపూడి పాపారావు ,అఖిలభారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ఈ సందర్భంగా శనివారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీల సర్పంచులకు ఐదవ ఆర్థిక సంఘం నుంచి రావలసిన రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను తక్షణం బదిలీ చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సచివాలయాలను గ్రామ పంచాయతీల సర్పంచ్ల ఆధ్వర్యంలో నడిచే విధంగా ఆదేశాలు జారీ చేయాలని, గౌరవ సర్పంచులకు హెల్త్ కార్డులను ఇవ్వాలని, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.20 లక్షలు సర్పంచులకు ప్రభుత్వం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ముప్పాళ మనోహర్, సర్పంచ్ లు డి.సూర్య ప్రకాష్, ఎన్ లలిత కుమారి, మబ్బు శిరీష సుధాకర్,తోకల సరోజినీ నరసింహారావు, ఏరువా జగన్ మోహన్ రెడ్డి, చుండు వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## టిటిడి వైపు జంగా చూపు?

**గుంటూరులో యాదవ కులస్తులతో ఆత్మీయ భేటి**

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

గుంటూరు బ్రాడీపేటలోని ఒక హోటల్‌లో ఎమ్మెల్సీ జంగాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో శనివారం రాత్రి యాదవుల ఆత్మీయ సమ్మెళనం జరిగింది. గత ప్రభుత్వం హాయంలో ఒక డిఎస్పీతో తనకు ఘర్షణ అయితే వైసిపి నాయకులు షహకరించలేదని ఆయన తన కులస్తుల దృష్టికి తీసుకువచ్చారు. తనకు ఆనాడు యాదవుల కులస్తులే సహకరించారని ఈ ఘర్షణకు మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి కారణంగా చెప్పుకొచ్చారు. అప్పట్లో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సహకరించలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి టిక్కెట్ ఇవ్వాలని కోరానని తెలిపారు. 2019లో సీటు ఇవ్వకుండా కాసు మహేష్‌రెడ్డికి ఇచ్చారన్నారు. 2014లో వైసిపినుంచి కేవలం ఏడువేల ఓట్ల తేడాతో ఓడిపోతే సీటు నిరాకరించారని కానీ 30 వేల తేడాతో ఓడిపోయిన వారికి సీట్లు ఇస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2019లో అనాడు జగన్ నేను సిఎం కావడం ముఖ్యమా మీరు ఎమ్మెల్యే కావడం ముఖ్యమా అని అడిగారని అప్పట్లో జగన్‌పై గౌరవంతో సీటు త్యాగం చేసినట్టు తెలిపారు. కానీ ఇప్పటికీ ఈ సీటు బిసిలది కాదని చెబుతున్నారు. అందువల్ల నా భవిష్యత్తుకోసం ఈసమావేశంలో చర్చిస్తున్నట్టు తెలిపారు. తనకు అత్మభిమానం అత్మ గౌరవం దెబ్బతింటుందన్నారు. గురజాల నియోజకవర్గం బిసిలదని తాను గతంలో నాలుగు సార్లు పోటీ చేశానని తెలిపారు. ఇదిలా ఉండగా గత కొంత కాలంగా అసంతృప్తిగాఉన్న జంగాకృష్ణమూర్తి పార్టీ మారతారంటూ ప్రచారం జరుగుతోంది. వైసిపినుంచి బయటకువచ్చిన మాజీమంత్రి పార్థసారధితో కూడా ఇటీవల జంగా భేటి ప్రాధాన్యత సంతరించుకుంది. గురజాల లేదా గుంటూరు పశ్చిమలో పోటీ చేసేందుకు అవకాశం ఇస్తే టిడిపిలో చేరడానికి సిద్ధంగా ఉన్నట్టు ఆయన తన అనుయాయులవద్ద ప్రస్తావించినట్టు తెలిసింది. ఈనేపథ్యంలో గుంటూరులో ఆయన తన అనుచరులతో కుల సంఘం నాయకులతో భేటి కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ప్రశ్నిస్తే పోలీసులతో దాడి

**మహేష్‌పై దాడిని ఖండించిన సిపిఎం**

**ప్రజాశక్తి-సత్తెనపల్లి:** శాంతియుతంగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలను సత్తెనపల్లి ప్రాజెక్టు సిడిపిఒ ఫోన్లు చేసి బెదిరించి విధుల్లోకి చేరాలని ఒత్తిడి చేయడాన్ని సిఐటియు మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ ప్రశ్నించినందుకు పోలీసులచే దాడి చేయించడం దుర్మార్గమని ఈ దాడిని సిపిఎం పలనాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శాంతియుతంగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై ఒత్తిడి పెంచి బెదిరింపులకు పాల్పడి శాంతి భద్రతల సమస్యను సృష్టించవద్దని ఆయన అన్నారు. సిడిపిఓ కార్యాలయం పని వేళలు సాయంత్రం ఐదు గంటల తర్వాత రాత్రి 7:30 గంటలకు సమయంలో సత్తెనపల్లి సమ్మె శిబిరం నుండి ఆటోలలో ఇళ్ళకు వెళ్లిన అంగన్వాడీలను ఫోన్ చేసి బెదిరించి విధులకు చేరాలని చెప్పి అదే ఆటోలలో సిడిపిఓ కార్యాలయానికి పిలిపించడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ఈ పద్ధతి సరైనది కాదని ఆఫీసు వేళలు కాని సమయంలో రాత్రిపూట అంగన్వాడీలను సిడిపిఓ కార్యాలయానికి పిలిపించడాన్ని ప్రశ్నించిన సిఐటియు మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ ను పోలీసులు చేత దాడి చేయించి, బూటుకాళ్లతో తన్ని, గాయపరచడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలో మహేష్ సొమ్మసిల్లి పడిపోయి ఆసుపత్రి పాలైన పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు కారకులైన సిడిపిఓ, పట్టణ పోలీసులు మహేష్‌కు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్వాడీల పై ఒత్తిడి పెంచి బెదిరించే కార్యక్రమం మానుకొని అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని ఆయన పేర్కొన్నారు.

### దిగివచ్చిన సిడిపిఒ

**సిఐటియు నాయకులు మహేష్‌కు క్షమాపణ**

**సిడిపిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ధర్నా**

**ప్రజాశక్తి-సత్తెనపల్లి**

అంగన్వాడీలకు అండగా నిలిచిన సిఐటియు మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ పై సిడిపిఓ శ్రీలత పోలీసులచే దాడి చేయించడాన్ని ఖండిస్తూ సిఐటియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం సత్తెనపల్లి ప్రాజెక్టు సిడిపిఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు సమ్మె విచ్ఛినం చేయడానికి అంగన్వాడీల ఫోన్లు చేసి బెదిరించి విధుల్లోకి చేరమని ఒత్తిడి చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ఆఫీసు వేళలు కాకుండా రాత్రిపూట ఫోన్లు చేసి పిలిపించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించిన సిఐటియు మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ పై సిడిపిఓ పోలీసుల చేత దాడి చేయించడం దుర్మార్గమని ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు కారణమైన సి డి పి ఓ పెండ్యాల మహేష్ కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిడిపిఓ పెండ్యాల మహేష్‌కు క్షమాపణ చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు జిల్లా నాయకులు గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల సమ్మెను విచ్ఛిన్నానికి ప్రయత్నం చేయడం మానుకొని వారి న్యాయమైన సమస్యలను పరిష్కారానికి చర్యలు చేపట్టి సమ్మె ను విరమింప చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఐద్వా జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజిని, పట్టణ కార్యదర్శి గద్దె ఉమశ్రీ, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా శివ దుర్గారావు, సత్తెనపల్లి ప్రాజెక్టు అధ్యక్షులు గుజ్జర్లపూడి సుజాత, లీడర్లు ధనలక్ష్మి, చాముండేశ్వరి, భవాని, రమాదేవి పాల్గొన్నారు.

## బెదిరింపులు వీడి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

నిజా నిజాలు ప్రజలకు తెలుసునని అయినప్పటికీ ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు అసత్య ప్రచారాలు చేయడం తగదని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక స్టేషన్ రోడ్ లోని గాంధీ పార్క్ వద్ద ధర్నా చౌక్ లో చేపట్టిన నిరవదిక సమ్మె శనివారం 4వ రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని వ్యవసాయ కార్మిక సంఘం కౌలు రైతు సంఘం పిడిఎం ఇతర ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం తెలిపి ప్రసంగించారు. సమ్మె శిబిరం వద్ద నుండి గడియార స్తంభం సెంటర్ వరకు అంగన్వాడీలు ప్రజా సంఘాల నాయకులు ర్యాలీగా వెళ్లి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా అంగన్వాడీల వేతనాలు పెంచాలని 2021 నుండి అనేకమార్లు నిరసన కార్యక్రమాలు చేపట్టారని ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చారని అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. కనీసం ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో అయిన గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పనిసరిగా అమలు చేయాలని అంగన్వాడిలు 40 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం మొండి వైఖరి వీడకపోవడం సిగ్గుచేటన్నారు. షాడో ముఖ్యమంత్రి షాడో ప్రభుత్వం అంటూ మండిపడ్డారు. ప్రభుత్వం ఏకపక్ష తీరును మార్చుకోవాలని డిమాండ్ చేశారు. 2019లో ఎన్నికల ప్రచారంలో తెలంగాణ కంటే అదనంగా ఇస్తానని చెప్పిన ప్రకారం వేతనాలు చెల్లించినా ఏడాదికి రూ 350 కోట్లు చెల్లించాల్సి వస్తుందని నగదు బదిలీ పథకాలకు వేల కోట్లు కేటాయించే ప్రభుత్వానికి అంగన్వాడిల నాయమైన సమస్యలు పరిష్కరించడం భారమేమీ కాదని అయినప్పటికీ ప్రభుత్వం మొండి వైఖరిగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. నిరాహార దీక్షలు చేస్తున్న అంగన్వాడి నాయకులకు ఏదైనా జరిగితే ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. నియోజకవర్గ టిడిపి బాధ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ రకాలుగా బెదిరింపులకు పాల్పడినప్పటికీ అంగన్వాడీలు బెదరకుండా ధైర్యంగా పోరాటం చేయడం పట్ల అభినందనలు తెలిపారు.

మాట్లాడుతున్న గుంటూరు విజయకుమార్

ప్రభుత్వ షోకాజు నోటీసులకు అంగన్వాడీలు ధైర్యంగా సమాధానం ఇవ్వడం పట్ల ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొమ్ముల నాగేశ్వరరావు, అనుముల లక్ష్మీశ్వరరెడ్డి లు మాట్లాడుతూ అంగన్వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేయడం ఏ ప్రభుత్వాలకు సాధ్యం కాదనే విషయాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గ్రహించాలని హితవు పలికారు. తాత్కాలికంగా ఇతర సిబ్బంది ద్వారా అంగన్వాడీ వ్యవస్థను నడిపించినప్పటికీ అంగన్వాడిలను బెదిరించడానికేనన్నారు. రకరకాలుగా ఇప్పటికీ బెదిరిస్తూనే ఉన్నారని ఏం జరిగినా అంతిమ విజయం అంగన్వాడీలదేనని వేతనాలు పెంచి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 40 నిముషాల పాటు జరిగిన రాస్తోరోకోతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు జోక్యం చేసుకొని ట్రాఫిక్ సమస్య ఉన్న నేపథ్యంలో సహకరించాలని రాస్తోరోకో విరమించాలని కోరడంతో రాస్తోరోకో విరమించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి షేక్ సిలార్ మసూద్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి శివకుమారి, పిడిఎఫ్ నాయకులు నల్లపాటి రామారావు, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు కుమ్మెత కోటిరెడ్డి, నాయకులు గూడూరు శేఖర్, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ నాయకులు కె.ఏడుకొండలు, దళిత సంఘాల నాయకులు భూదాల బాబురావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు బి నిర్మల, డి మాధవి, బి సాయి, బివి రమణ, యు పద్మ, లుదియా తదితరులు పాల్గొన్నారు.

# 25 నాటికి పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు

**ప్రజాశక్తి-గుంటూరు**

కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను ఈనెల 25వ తేదీ నాటికి పూర్తి చేయాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కీర్తి చేకూరి ఆయా డిపార్ట్మెంట్ అధికారులకు స్పష్టం చేశారు. శనివారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో అదనపు కమిషనర్, జిఎంసి ఇంజినీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులతో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నగరంలోని ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఉన్నాయని, వాటిలో పోలింగ్ నిర్వహణకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై విద్యాశాఖ, జిఎంసి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో వద్దులకు, వికలాంగులకు వీలుగా ర్యాంప్‌లు, టాయిలెట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్న మౌలిక వసతుల ఏర్పాటుపై ఎస్.ఈ.తో కలిసి ఏఈఆర్ఓ, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్లు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్ఓ, అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి, ఎస్ఈ (ఎఫ్ఏసి) సుందర్రామిరెడ్డి, ఈఈలు కొండారెడ్డి, శ్రీనివాస్, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

## చంద్రబాబు దళితులకు అన్యాయం చేశారు

### ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

**ప్రజాశక్తి పొన్నూరు రూరల్**

చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా 14 సంవత్సరాలు చేసిన దళితులకు ఎటువంటి న్యాయం చేయలేదని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ధ్వజమెత్తారు. శనివారం నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి లబ్ధి చేకూరేలా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమం కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. 400కోట్ల రూపాయలతో డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ 206 అడుగుల విగ్రహం నిర్మించడం చారిత్రాత్మకమన్నారు. మీరు చేయలేరు,మేము చేస్తే ఓర్వలేరు ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలు కారంచేడు, నీరుకొండ ఘటనలు మరవ లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యే ఎంపీలు గా దళితులను కూర్చోబెట్టిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిదే అన్నారు. ధూళిపాళ్ల అధికారంలో వున్నప్పుడు ఒక్క దళితుడికి కూడా మంచి పదవి ఇవ్వలేదు అన్నారు. దళితులను ఓటు బ్యాంక్ క్రింద చూసారే తప్ప వారి అభివృద్ధికి చేసిన చర్యలు శూన్యం అని చెప్పారు. ప్రతిపక్ష నాయకులు నిసిగ్గుగా మాట్లాడు తున్నారని ఆరోపించారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ భావజాలాన్ని ప్రజలలోకి తీసుకొని వెళ్లిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిదేనని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు

**ధూళిపాళ్ల అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి**

విజయవాడలో శుక్రవారం జరిగిన సామాజిక సమతా సంకల్ప సభ విజయాన్ని తట్టుకోలేక సోషల్ మీడియా వేదికగా 90 రోజుల్లో అధికారంలోకి వస్తే అంబేద్కర్ విగ్రహాన్ని కూల్చివేస్తానన్న ధూళిపాళ్ల నరేంద్ర వ్యాఖ్యలను వైసిపీ దళిత నాయకులు తీవ్రంగా ఖండించారు. పొన్నూరు పట్టణ వైసిపి కార్యాలయం ఎస్ ఆర్ సి పి ఎస్సీ సెల్ అధ్యక్షులు పెరికల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశంలో దళిత నాయకులు మాట్లాడారు. గత టిడిపి ప్రభుత్వంలో ఈ స్థలాన్ని 100 సంవత్సరాలు లీజుకి నారాయణకి ఇచ్చిన చంద్రబాబు నాయుడు, తర్వాత జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో ఆ స్థలంపై కోర్టు కేసులో గెలిచి అదే స్థలంలో విజయవాడ నడి బొడ్డులో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించటం ధూళిపాళ్ల నరేంద్ర జీర్ణించుకోలేకపోతన్నారని, అహంకారంతో ఏ విధంగా మాట్లాడుతున్నది ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రుద్రపాటి ఆదిశేషులు , పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు పుట్ల సంపత్ , మామిళ్ళపల్లి సర్పంచ్ యానాది రావు, మూకిరి అనిలా కుమారి, తదితరులు పాల్గొన్నారు

## ఆమరణ దీక్షకు సిద్ధం : పారేపల్లి

**ప్రజాశక్తి మంగళగిరి :** రానున్న రోజుల్లో ఏ రాజకీయ పార్టీ అయినా సరే గెలిచిన మూడు నెలల్లోపు స్వర్ణకార కార్పొరేషన్ కనుక ఏర్పాటు చేయకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ తెలిపారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో మంగళగిరి షరాఫ్ బజార్ లోని స్వర్ణకారులకు రెండు వేయింగ్ మిషన్లు, 35 మందికి స్వర్ణకార పనిముట్లు, 100 గోడ గడియారాలు శనివారం పంపిణీ చేశారు. నమోదు చేసుకున్న మిగిలిన వారికి అతి త్వరలో పంపిణీ చేస్తానని మహేష్ తెలిపారు. పంపిణీ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే వేణుమాధవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారేపల్లి మహేష్ విలేకరు లతో మాట్లాడుతూ స్వర్ణకారులకు కార్పొరేషన్ నిధులు లేనందువల్ల అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకొని పేద స్వర్ణకారులు చాలా నష్టపోతున్నారని అన్నారు. కార్యక్రమం లో ధనాలకోట వాసు, కొల్లి గిరిధర్, జింక దివ్య నారాయణ, యు నాగేంద్ర కుమార్, మంద్రు సత్యనారాయణ, ధనుంజయ్ పాల్గొన్నారు.

## కనీసం వందరోజు ఉపాధి పనులు

**ప్రజాశక్తి - చేబ్రోలు :** ప్రతి ఆర్థిక సంవత్సరంలో కనీసం వందరోజుల వేతన ఉపాధితో పాటు గ్రామీణ ప్రాంత కుటుంబాల జీవనోపాధి భద్రతను పెంపొందించడం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ముఖ్య ఉద్దేశ్యం అని ఎపిఒ కె. ఆనందమోహన్ తెలిపారు. చేబ్రోలు మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఎన్ఆర్ఈజీఎస్ మెట్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఇన్చార్జి ఎంపీడీవో జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధి పని కోసం జాబ్ కార్డు పొందే విధానము మరియు దాని ప్రయోజనాలు అంశాలు గురించి శిక్షణలో మెట్లు అవగాహన పొందాలని అన్నారు. తద్వారా కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. పని ప్రదేశంలో ప్రమాదం జరిగితే ఫీల్డ్ అసిస్టెంట్లకు సమాచారం అందించాలని తెలిపారు.

మాట్లాడుతున్న పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి శేఖర్

## ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

**ప్రజాశక్తి - మేడికొండూరు**

మండలంలోని సత్తనపల్లి రోడ్డు లోని విశదల అడ్డరోడ్డు వద్దగల, ఎన్నారై ఐటి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం పాలిటెక్నిక్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే కార్యక్రమము ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎం బి టి ఎస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి శేఖర్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఒక సముచితమైన స్థానము లో స్థిరపడేందుకు విద్యార్థి దశ చాలా ప్రాముఖ్యమైనదని గుర్తించాలన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి ఇష్టంతో చదివి మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు. లక్ష్యం దిశగా ముందుకు సాగాలని అన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఆదర్శవంతంగా ఉండాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కోటా శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లో ఉన్నదని, దేశ సంపద విద్యార్థులేనని అన్నారు. పుట్టిన గడ్డను తల్లిదండ్రులను ఎవరు మర్చిపోకూడదని గుర్తు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ విభాగపు ప్రిన్సిపల్ పి రవికుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీహరి రావు, వివిధ విభాగాల హెచ్ ఓ డి లు డాక్టర్ చంద్రమౌళి, డాక్టర్ రాము, డాక్టర్ జగన్మోహన్, డాక్టర్ మల్లేశ్వరి , డాక్టర్ రెహమాన్, డాక్టర్ మనోహర్, డాక్టర్ కె ఎస్ ఆర్, పలువురు అధ్యాపక సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## వర్సిటీలో ఫిబ్రవరి 14 నుండి జాతీయ సదస్సులు

**ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ...**

**ప్రజాశక్తి - ఎఎన్‌యు**

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 15, 16 తేదీలలో జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్ డాక్టర్ ఎం. గాయత్రి రమ్య తెలిపారు. ఈ మేరకు శనివారం సదస్సు బ్రోచర్‌ను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పట్టేటి రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గాయత్రి రమ్య మాట్లాడుతూ కాంటెంపరరీ స్ట్రాటజీస్ ఇన్ డ్రగ్ ప్రోడక్ట్ డిజైన్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సదస్సుకు కో కన్వీనర్ గా డాక్టర్ డి. రవిశంకర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ యు. అన్నపూర్ణ, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా డాక్టర్ కే. సుజనా, డాక్టర్ కేవీ. ప్రవల్లిక, ట్రెజరర్ గా విజయ కిషోర్ వ్యవహరించనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టర్ ప్రొఫెసర్ పి. వరప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. కరుణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రమీలరాణి అధ్యాపకులు పాల్గొన్నారు.

## తెలుగు ప్రాచ్య భాష విభాగం ఆధ్వర్యంలో..

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని తెలుగు ప్రాచ్య భాషా విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్ ఆచార్య ఈ. మాధవి తెలిపారు. ఈ మేరకు శనివారం సదస్సు బ్రోచర్‌ను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి. రాజశేఖర్ ఆవిష్కరించారని ఆమె పేర్కొన్నారు. సంస్కృతాంధ్ర నవలా సాహిత్యం సామాజిక చైతన్యం అనే అంశంపై ఫిబ్రవరి 14, 15 తేదీలలో సదస్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ పి. వరప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. కరుణ, విభాగం అధ్యాపకులు ఆచార్య ఎన్వి కష్ణారావు, పీజీ పరీక్షల కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఉదయ్ కుమార్, విభాగం అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్‌కళాశాలల బెస్ట్ ఫిజిక్ పోటీలు

**ప్రజాశక్తి - ఎఎన్‌యు**

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శనివారం అంతర కళాశాలల బెస్ట్ ఫిజిక్ (పురుషుల) పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ కళాశాలలకు చెందిన పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. తెనాలి ఏఎస్ఎన్ కళాశాలకు చెందిన జి. సందీప్ కుమార్ బెస్ట్ ఫిజిక్ గా ఎంపికైనట్లు తెలిపారు. సందీప్ కుమార్ యూనివర్సిటీ ఆఫ్ కాలికట్‌లో నిర్వహించే అఖిలభారత అంతర విశ్వవిద్యాలయాల బెస్ట్ ఫిజిక్ పురుషుల పోటీలలో యూనివర్సిటీ నుంచి పాల్గొంటారని తెలిపారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా చేబ్రోలు లోని ప్రభుత్వ కళాశాల, తెనాలి ఎఎస్ఎన్ కళాశాల వ్యాయామ అధ్యాపకులు పి. గణేష్, డాక్టర్ ఎన్. శేషగిరిరావు, టెక్నికల్ అఫీషియల్‌గా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ నుండి వెంకటేశ్వరరావు, పి. రామకృష్ణ, ఎ. జగపతిబాబు వ్యవహరించారు.

## బ్యాక్ లాగ్ పోస్టుల అభ్యర్థులకు నియామక పత్రాలు

**ప్రజాశక్తి- గుంటూరు :** ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ అత్యంత పారదర్శకంగా మెరిట్ ప్రాతిపదికన అర్హత వున్న అభ్యర్థులను ఎంపిక చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన రిక్రూట్మెంట్లో ఉద్యోగాలు పొందిన 27 మంది అభ్యర్థులకు శనివారం కలక్టరేట్ లోని డీఆర్సీ హాలులో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి , సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారితో కలసి నియామక ఉత్తర్వులు అందించారు. నోటిఫికేషన్ లో జారీ చేసిన 54 పోస్టులలో 27 పోస్టులకు సంబంధించి నియామక ఉత్తర్వులు అందించటం జరుగుతుందని, వివిధ కారణాలతో కొన్ని పోస్టుల భర్తీని పెండింగ్ లో ఉంచటం జరిగిందని, వారికి కూడా త్వరలో నియామక ఉత్తర్వులు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నియామక ఉత్తర్వులు పొందిన వారు వారికి కేటాయించిన ప్రభుత్వ శాఖల్లో బాధ్యతగా పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కే. చంద్ర శేఖర రావు , సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు మధుసూదనరావు, ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

**మహారాజశ్రీ చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టు**
**ఓ.యస్. నెం. 283/2020**
**ఇన్ ఐ.ఎ. నెం. 1557/2023**

బిట్వీన్ :
1. గట్టా సూర్యనారాయణ (డైడ్)
2. గట్టా హేమకుమార్ ... పిటీషనర్ / వాది

వర్సెస్

మిట్టపల్లి రామారావు (డైడ్) అండ్ 8 ఇతరులు
**R2)** మిట్టపల్లి సత్యవతి, W/o లేటు రామారావు
**R4)** మిట్టపల్లి శివకుమార్ S/o లేటు రామారావు
**R5)** మిట్టపల్లి శరత్‌బాబు S/o లేటు రామారావు
**R6)** మిట్టపల్లి నాగరాజలక్ష్మి W/o హరిప్రసాదరావు
**R7)** కూనల రేణుక దేవి W/o లేటు ఓంకార్ గుప్త
**R8)** శ్రీరాం విజయలక్ష్మీ W/o వెంకటేశ్వరరావు
R/o జయ నర్సింగ్‌హోమ్ ఎదురుగా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేడ మీద, చిలకలూరిపేట, పల్నాడుజిల్లా.
**R2, R4, R5, R6, R7,** R/o డి.నెం. 25-1-52, ఓల్డ్ క్లబ్ రోడ్, పువ్వాడ వారివీధి, అన్న శ్రీనివాస కళ్యాణ మండపం దగ్గర, కొత్తపేట, గుంటూరు
... ప్రతివాదులు

పై నెంబరు గల దావాలో మీరు ప్రతివాదులు అయివున్నారు. శ్రీ కోర్టువారి నుంచి ఎన్ని పర్యాయములు సమన్లు పంపినను ఉద్దేశ్యపూర్వకంగా మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం ఈ పత్రికా ప్రకటన ద్వారా పై కేసు తేది 23-1-2024వ తేదీన వాయిదా వున్నదని తెలియజేయడమైనది. కావున వాయిదా రోజున ఉదయం 10-30 గం.లకు శ్రీ కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, వకీల్ ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియచేసుకోవలసినది. లేనిచో మీ పరోక్షమున వాయిదా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 23-1-2024

**డి.వి.నాగరాజు,**
**వాది తరఫు న్యాయవాది,**
**చిలకలూరిపేట.**

**మహారాజశ్రీ పిడుగురాళ్ళ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో**
**ఓ.యస్. నెం. 205/2023**

బిట్వీన్ :
బొగ్గవరపు కోటేశ్వరి .... వాది
మరియు
వంకాయల మురళి గోపాలకృష్ణా ... ప్రతివాది
ప్రతివాది : వంకాయల మురళి గోపాలకృష్ణా, తండ్రి : పిచ్చయ్య, డోర్ నెం. 11-34-35, ఓల్డ్ ఎస్‌బిఐ స్ట్రీట్, జానపాడు రోడ్డు, పిడుగురాళ్ళ టౌన్, పల్నాడుజిల్లా.

పై నెంబరు దావాలో వాది పరిహారం నిమిత్తం మీపై దావా వేసివుండుట వలన మీరు స్వతహాగా గానీ, లేక మీ తరఫు న్యాయవాది ద్వారా కాని ది. 22-01-2024 న ఉదయం 10-30 గం.లకు పైన తెలిపిన కోర్టులో హాజరై మీకుగల అభ్యంతరములు తెలియపరచ వలసినది. లేనియెడల మీకు పరోక్షంగా దావాలో విచారణ జరిపి తగిన నిర్ణయం పై కోర్టువారు తీసుకొనగలరని దావాను తీర్మానం చేయగలరని పై కోర్టువారి ఉత్తర్వులు మేరకు మీకు తెలియ జేయటమైనది.

**ఇట్లు**
**ఆర్.సాంబశివరావు,**
**అడ్వకేట్, పిడుగురాళ్ళ.**

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న గద్దె చలమయ్య

## బెదిరించాలని చూస్తున్న ప్రభుత్వం

**ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్**

అంగన్వాడీల డిమాండ్లను నేరవేర్చుటానికి ఇష్టపడని జగన్ ప్రభుత్వం ఏదోక విధంగా ఉద్యమాన్ని నీరు కార్చాలని ఎన్నో కుయుక్తులు పన్నుతుంది అందులో భాగమే ఇప్పటి వరకు ఎస్మా చట్ట ప్రయోగం ,షోకాజ్ నోటీసులు వీటికి భయ పడక పోవటంతో ఇప్పుడు ఏకంగా ఐసిడియస్ అధికారులతో, సహాఉద్యోగులతో అంగన్వాడీలను భయపెట్టాలని చూస్తుం దని సిపిఎం నాయకులు గద్దె చలమయ్య ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు . శనివారంఆయన స్థానిక అంగ న్వాడీ దీక్ష శిబిరం వద్ద ఏర్పాటు చేసిన అన్ని రాజకీయ పార్టీల రౌండ్ టేబుల్ సభలోఆయన మాట్లాడారు . సభకు కట్టా శివదుర్గారావు అధ్యక్షత వహించారు. అనంతరం చలమయ్య మాట్లాడుతూ తాను మహిళా పక్షపాతిని అని అనేక సందర్భాల్లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి జగన్ గత 40 రోజులుగా కుటుంబాలను వదలి తమన్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సమ్మెచేస్తుంటే కనబడటం లేదా అని ప్రశ్నించారు. ప్రజాబలం ముందు ఏ చట్టాలు పనిచేయవు , ఏ ప్రభుత్వాలు మనుగడ సాగించిన దాఖలాలు లేవని అంగన్వాడీలకు భరోసా కల్పించారు. అంగన్వాడీల ఉద్య మానికి సిపిఎం అన్ని వేళల అండగా ఉంటుందని చెప్పారు. అనంతరం టిడిపి , జనసేన ,కాంగ్రెస్, జై భీంరావు భారత్ పార్టీ, ఐద్వా సంఘనేతలు మాట్లాడారు. అంగన్వా డీలడిమాండ్లను పరిష్కరించక పోగా అణిచి వేయాలని చూడటం విచారకరమన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయ కులు గద్దె ఉమశ్రీ , రజనిటీడీపీ నాయకులు పి వెంకటకోటయ్య , జనసేననాయకులు ఆర్ సుమన్ , కాంగ్రెస్ నాయకులు ఆర్రామకృష్ణ , జై భీంరావు పార్టీ నాయకులు విజయ్ , పట్టణ సీఐటీయూ నాయకులు ఆర్ పురుషోత్తం ,భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు అవ్వారు ప్రసాదరావు, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అనుముల వీరబ్రహ్మం , ప్రజా నాట్యమండలి జిల్లా నాయక ులు సూరి, డివై ఎఫ్ ఐ నాయకులు జడ రాజకుమార్, అంగ న్వాడీ నాయకులు సుజాతఅహల్య , చామోండేశ్వరి , దుర్గాదేవి , ధనలక్ష్మి ,పద్మావతి , శశికళ తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి జట్టు గెలుపు

**ప్రజాశక్తి-అమరావతి**

ఆడదామా ఆంధ్ర లో భాగంగా అమరావతి మండలంలో ధరణికోట గ్రామం క్రీడా ప్రాంగణంలో శనివారం వైకుంఠపురం మరియు అమరావతి క్రికెట్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ పోటీలో అమరావతి జట్టు విజయం సాధించింది. విజేతలను రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షులు అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు అభినందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో క్రీడల పండుగ జరుగుతుందని లక్షలాదిగా యువతి యువకుల ఉత్సాహంగా పాల్గొంటున్నారని ఎంపిపి తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని పెంపొం దించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీడీవో కె శ్రీనివాసన్,సచివాల సిబ్బంది సాదిక్,భవ్య, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్వాడీల నిరసన..రాస్తారోకో

రాస్తారోకోను ఉద్దేశించి మాట్లాడుతున్న గుంటూరు మల్లేశ్వరి

పిడుగురాళ్లలో.

చిలకలూరిపేటలో.

**ప్రజాశక్తి-సత్తెనపల్లిటౌన్**

అంగన్వాడీల సమస్యల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మొండివైఖరితోపాటు సిఐటియు నాయకులు పెండ్యాల మహేష్ పై పోలీసులు దాడిని నిరసిస్తూ శనివారం సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు గుంటూరు మాచర్ల రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేస్తున్న శనివారానికి 40వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా అంగన్వాడీ వర్కర్స్అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వం తీరును ప్రశ్నిస్తున్న వారిపై పోలీసులతో భౌతిక పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో భాగంగానే సిఐటియు మండలకార్యదర్శి పెండ్యాల మహేష్ పై పోలీసులు భౌతిక దాడికి పాల్పడ్డారని, ఈ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. రాస్తా రోకోతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఎ వీరబ్రహ్మం,కె.శివదుర్గారావు, అవ్వారు ప్రసాదరావు , రాజకుమార్ , వంగర తుల సీలతో పాటు అంగన్వాడీ అసోసియేషన్ నాయకులు సుజాత, అహల్య,ధనలక్ష్మి, దుర్గాదేవి, చాముండేశ్వరి ఉన్నారు .

**ప్రజాశక్తి-పిడుగురాళ్ల**

స్థానిక బంగ్లా సెంటర్ నుండి జానపాడు రోడ్డు బ్యాంక్ సెంటర్ ఐలాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి రాస్తా రోకో చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘ నాయకులు గోపాలరావు మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు అంగన్వాడి యూనియన్ నాయకులు షేక్ హజ్రా, శాంతమని రైతు సంఘం నాయకులు బుంగ నాగేశ్వరరావు గడ్డం కోటేశ్వ.రరావు, కోటిరెడ్డి ,మజ్జిగ నరసింహారావు,సోమా ప్రసాదు, సిఐటియు మండల అధ్యక్షులు సంపత్ వెంకటకృష్ణ వెంకయ్య, నాగేశ్వరరావు, కె.సీతారామయ్య బీసీ సంక్షేమ సంఘం నాయకులు దూదేకుల ఖాసిం సైదా, ఎడవల్లి, కొండలు, శీను, బాషా, కొక్కెర కొండలు, ఖమ్మంపాటి రాము ఎమ్మార్పీఎస్ నాయకులు ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-చిలకలూరిపేట**

రాజకీయ అనుబంధ జెఎసి సంఘాల నాయకుల మద్దతుతో శాఖా గ్రంథాలయం నుంచి ఎన్ఆర్టి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ క్రమంలో అర్బన్ పోలీసులు వారిని అడ్డుకొనే ప్రయత్నం చేశారు. రాస్తారోకో చేస్తున్న వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కి తరలించారు. ఆందోళనకారులు ప్రతి ఘటించటంతో స్వల్ప తోపులాట జరిగింది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం అధ్యక్షులు వై.రాధాకృష్ణ చొక్కా చిరిగి పోయింది. రాస్తారోకో అనంతరం అంగన్వాడీలు మిగిలిన జేఏసీ అన్ని పార్టీల నాయ కులు స్టేషన్ బయట బైటా యించి అదుపులోనికి తీసుకున్న వారిని విడుదల చేయాలని ఆందోళనకు దిగారు. సిఐ సీహెచ్ సీతారామయ్య, ఎస్ ఐ లు లోకేష్, మోహన్ ఆందోళనకారులకు నచ్చచెప్పి ఆందోళన విరమింపచేసి వారిని విడుదల చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పేరుబోయిన వెంకటేశ్వ ర్లు, సిపిఎం సీనియర్ నాయకులు పోపూరి సుబ్బారావు, కాళిదాసు,ఎం.విల్సన్, బి.కొటా నాయక్, ఎస్.బాబు, అంగ న్వాడీల సంఘ నాయకులు జి.సావి త్రి, తెలుగుదేశం పార్టీ మహిళా రాష్ట్ర కార్యదర్శి షేక్ జరినా సుల్తానా, వని తాబాయి. ముత్తయ్య,సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామసు బ్బాయమ్మ, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీన ర్ షేక్ సుబాని,నాయకులు పేలూరి రామారావు, బొంతా భగత్ సింగ్ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-వినుకొండ**

వినుకొండ-నరసరావుపేట రహదారిపై రాస్తారోకో నిర్వహించారు కార్యక్రమంలో అన్ని ప్రజా సంఘాల పార్టీలు మద్దతు తెలిపారు. సుమారు 45 నిమిషాల పాటు రాస్తారోకో కొనసాగింది. ఈ సందర్భగా జనసేన పార్టీ నాయకులు ఎన్. శ్రీనివాసరావు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాద్ మాట్లాడారు. మజ్లిస్ పార్టీ నుండి ఎస్కె బాజీ , కాంగ్రెస్ నుండి ఆర్కే నాయుడు, జనసేన పార్టీ నుండి వీర మహిళలు ఉషారాణి భాగ్యలక్ష్మి పాల్గొని మద్దతు తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ రూబెన్, సిపిఎం నాయకులు బి. వెంకటేశ్వర్లు, సిఐటియు అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, అంగన్వాడీ జిల్లా ట్రెజరర్ ఎ.లక్ష్మీ ప్రసన్న, ఈపూర్ నుండి సూర్యకాంతం, పి.అనురాధ,సెక్టార్ లీడర్స్ డి బీబులు నిర్మల సిహెచ్ గాయత్రి, జి పద్మ, బి.శ్రీదేవి, హరిత, పి.ఉమాశంకరి మధ్యాహ్న భోజనం నాయకులు తిరుమల లక్ష్మి రమాదేవి సీత పాల్గొన్నారు అంగన్వాడీల న్యాయమైన సమ స్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్క రించాలని సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు మద్దతు తెలియజేశారు

చిలకలూరిపేటలో పోలీసుల పెనుగులాటలో వై.రాధాకృష్ణ చొక్కా చిరిగిపోయిన చిత్రం

**ప్రజాశక్తి -అమరావతి**

అమరావతి తహసీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు నాయకులు బి.సూరిబాబు మాట్లాడారు. అనంతరం 40 అంకె ఆకారంలో ఏర్పడ్డ అంగన్వాడీలు 'ఆగదు ఆగదు మా పోరాటం' అని నినదించారు.

**ప్రజాశక్తి-మాచర్ల**

సమ్మె శిబిరాన్ని కాంగ్రెస్, జనసేన పలు ప్రజాసంఘాల నాయకులు సందర్శించి అంగన్వాడీలకు పూర్తి మద్దతు తెలిపారు. సమ్మెలో భాగంగా అంగన్వాడీలు అంబేద్కర్ సెంటర్లో రోడ్డుపై రాస్తారోకో చేశారు. సిఐటియు డివి జన్ నాయకులు ఆంజనేయులు నాయక్ బి.మహేష్, యూనియన్ నాయకులు ఉషారాణి, కోటేశ్వరి, శివకుమారి పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-క్రోసూరు**

సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై అధికార పార్టీ నాయకులు బెదిరింపులు ఆపాలని డిమాండ్ చేశారు. స్థానిక ఆమంచి విజ్ఞాన కేంద్రంలో అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంగన్వాడిల సమస్యపై ఆమంచి విజ్ఞాన కేంద్రం కన్వీనర్ తిమ్మిశెట్టి హనుమంతరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అనంతరం క్రోసూరులోని అంబేద్కర్ బొమ్మ సెంటర్ వద్ద కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి రాస్తారోకో చేసి స్థానిక తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.రవిబాబు, మం డల కార్యదర్శి గర్నేపుడి మహేష్, అధ్యక్షులు డి.మురళి, బీఎస్పీ నాయకులు గనుపల్లి శేఖర్, రైతు సంఘం జిల్లా నాయకులు అవుల ఆంజనేయులు,కంచేటి పెద్దబ్బాయి, అతోట బాలయ్య, రైతు సంఘం మండల అధ్యక్షులు అతోట వెంకటప్ప రావు , యుటిఎఫ్ నాయకులు ఖాజావలి, లక్ష్మణరావు, తెలుగు రైతు సంఘం డివిజన్ అధ్యక్షులు తోక వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట అర్బన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ..

వినుకొండలో..

అమరావతిలో..

మాచర్లలో..

క్రోసూరులో..

## పోలీసులు నాపై పాశవికంగా దాడి చేశారు

**ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్ :** ఐసిడిఎస్ అధికారుల ప్రోద్భలంతో పోలీసులు ఐసిడిఎస్ కార్యాలయంవద్ద తనపై పాశవికంగా భౌతిక దాడికి పాల్పడ్డారని మండల సిఐటియు కార్యదర్శి పెండ్యాల మహేష్ అన్నారు. శనివారం అంగన్వాడీ దీక్షాశిబిరం వద్ద పాత్రికేయులతో ఈ ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. విచక్షణ రహితంగా ప్రవర్తిస్తు రోడ్డుపై పడేసి ఇడ్చుకుంటూ పట్టణ పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లారని అన్నారు. ముప్పాళ్ళ మండలానికి చెందిన ఓ అంగన్వాడీ సూపర్‌వైజర్ మండలంలోని అంగన్వాడీ సిబ్బందికి ఫోన్ చేసి తక్షణమే విధుల్లో చేరకపోతే ఉద్యోగాలు పోతాయని హెచ్చరించారన్నారు. ఆ మాటలకు భయపడిన అంగన్వాడీ లు శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో పట్టణంలోని ఐసిడియస్‌కార్యాలయం వద్దకు చేరుకున్నారన్నారు. ఈవిషయం తెలిసి తాను, సిపిఎం నాయకులు గద్దె చలమయ్య ఆ కార్యాలయం వద్దకు వెళ్ళామన్నారు. కాగా అప్పటికే అక్కడ పోలీసులు చేరుకొని అక్కడ అంగన్వాడీలను సమ్మె విరమించి విధుల్లోకి వెళ్లాలని హడావిడి చేస్తున్నారన్నారు . ఈ విషయమై పోలీసులతో మాట్లాడుతుండగానే ఊహించని విధంగా పోలీసులు ఒక్కసారిగా తనపై భౌతిక దాడికి పాల్పడ్డారన్నారు . ఆ దాడిలో క్రిందపడినతనను తన చొక్కా పట్టుకొని రోడ్డుపై ఇడ్చుకుకుంటూ పోలీస్ జీపులో ఎక్కించారు అన్నారు .ఈ ఘటనను చూస్తున్న సీపిఎంనాయకులు చలమయ్య పై ఒక మహిళా ఎ ఎస్ ఐదౌర్జన్యంకు పాల్పాడుతూ నెట్టే ప్రయత్నం చేసిం దన్నారు . ఫోటోలు తీసారని చలమయ్య ఫోన్ కూడా లాక్కున్నట్లు చెప్పారు. పోలీసులు దాడిలో తాను తీవ్రంగా గాయపడి తాను స్థానిక ప్రభుత్వం వైద్యాశాలలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు.

# 40వరోజు రాస్తారోకోలతో అంగన్వాడీల నిరసన

పెదకాకానిలో రాస్తారోకోను అడ్డుకుంటున్న పోలీసులు

దుగ్గిరాలలో

గుంటూరులో

మేడికొండూరులో

మంగళగిరిలో

పెదనందిపాడులో

ఫిరంగిపురంలో

తాడికొండలో

తుళ్లూరులో

తెనాలిలో

పొన్నూరులో

తాడేపల్లిలో

ఆర్థిక సాయం అందజేస్తున్న గిరిజ

**ప్రజాశక్తి-గుంటూరు**

వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు తదితర డిమాండ్లతో అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 40వ రోజుకు చేరుకుంది. గుంటూరు కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న సమ్మె శిబిరానికి అంగన్‌వాడీలు హాజరై నిరసన తెలియజేశారు. ప్రభుత్వ మొండి వైఖరికి వ్యతిరేకంగా చెవులు, నోరు, కళ్లు మూసు కొని నిరసన తెలియజేశారు. అలాగే సమ్మె 40వ రోజుకు చేరుకున్నందుకు గుర్తుగా ఆ సంఖ్య రోడ్డుపై ముగ్గు వేసి నిరసన తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దీప్తి మనోజ మాట్లా డుతూ ప్రభుత్వం మరో 40 రోజులు స్పందించకున్నా తాము వెనకడుగు వేసే ప్రసక్తే లేదని, సమస్యలు పరిష్క రించే వరకూ పోరాడతామని చెప్పారు. కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి టి.రాధ, సిఐటియు గుంటూరు తూర్పు నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్**

కాకుమానులో అంగన్వాడీ రాస్తారోకోలో కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు ప్రసంగించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి. లక్ష్మణరావు, యూనియన్ నాయకులు ప్రేమలత, శ్రీ వాసవి తదితరులు పాల్గొన్నారు. సమ్మెకు సమగ్ర శిక్ష అభియాన్ జేఏసీ నాయకులు చలపతిరావు మద్దతు తెలిపారు.

**ప్రజాశక్తి - మేడికొండూరు**

మేడికొండూరులో అంగన్వాడీల సమ్మె కొనసాగింది. యూనియన్ నాయకురాలు మందా రజిని, కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బొట్ల రామకృష్ణ ప్రసంగించారు.

**ప్రజాశక్తి - ఫిరంగిపురం**

అంగన్వాడీలు రాస్తారోకో నిర్వహిం చారు. కార్యక్రమంలో సిఐటియు, రైతు పంఘం నాయకులు మస్తాన్‌వలి, సిహెచ్ వెంకటేశ్వర్లు ప్రసంగి ంచారు.

**ప్రజాశక్తి - తుళ్లూరు**

శనివారం రాజధాని ప్రాంతం తుళ్లూరులోని లైబ్రరీ సెంటర్ లో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకో లో సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం రవి, ఎంభాగ్యరాజు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు స్వర్ణలత, ఎస్‌కె కరీమూన్, అన్నామని, రజిని, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - దుగ్గిరాల**

తెనాలి విజయవాడ రహదారిపై స్థానిక పాతలా కుల వద్ద శనివారం అంగన్వాడీలు రాస్తారోకో నిర్వహించారు. అంతకుముందు సమ్మె చేస్తున్న శిబిరం నుండి ర్యాలీ నిర్వహించుకుంటూ రాస్తారోకో చేసిన ప్రదేశానికి చేరుకున్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు జయ వెంకటేశ్వరమ్మ సరోజిని లక్ష్మీ అనురాధ కోటేశ్వరమ్మ అనసూయ మిరియమ్మ శివపార్వతి మణెమ్మ సుగుణ సిఐటియు నాయకులు జెట్టి బాలరాజు, సిహెచ్ పోతురాజు కె కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - మంగళగిరి**

మంగళగిరి అంబేద్కర్ సెంటర్లో అంగన్వాడీలు రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చంగయ్య, మంగళగిరి పట్టణ కార్యదర్శి వై కమలాకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం బాలాజీ, కే ఉజ్వల్, అంగన్వాడి యూనియన్ నాయకులు హేమలత, రుక్మిణి, మేరీ రోజమ్మ, స్వర్ణ, భూలక్ష్మి, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర రోకో సందర్భంగా గౌతమ్ బుద్ధ రోడ్డుపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

**ప్రజాశక్తి తెనాలి రూరల్**

స్థానిక వి ఎస్ ఆర్ కళాశాల ఎదురుగా తెనాలి విజయవాడ రహదారిపై నిర్వహిస్తున్న అంగన్వాడీల సమ్మెకు సిఐటియు, సిపిఎం పార్టీలు మద్దతు తెలుపు తున్నాయి. శనివారం నిర్వహించిన సమ్మెలో అంగ న్వాడీలు తెనాలి ఐసిడిఎస్ కార్యాలయాన్ని చుట్టుముట్టారు. తమ న్యాయమైన కోర్కెలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో పి పావని, అనురాధ, హసీనా బేగం, నాగమణి, లావణ్య, కళాదరి, శ్రీలత, చిన్న తిరుపతమ్మ, ఎం ఆదిలక్ష్మి, రాధిక, స్వప్న, విజయలక్ష్మి, సువర్ణ, పార్వతి, స్వర్ణ, శ్రీదేవి, నళిని, సంతోష కుమారి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి -పెదకాకాని**

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని వారికి మద్దతుగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలోపెద్దకాకాని సెంటర్లో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ, సిపిఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ రైతు కూలి సంఘం జిల్లా నాయకులు దాన పోయిన భాస్కర్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కంతేటి యల మందరావు, ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి కొర్రపాటి సురేష్ లు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల్లో అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే సత్యనారాయణ, ఎస్ నీలాంబరం, వి శివయ్య, బి సాంబయ్య, బి బాబురావు, మహిళ సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి, ఏఐటీయూసీ నాయకులు మండే రవీంద్రబాబు, దర్శి లింగారావు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి పొన్నూరు రూరల్**

పొన్నూరులో అంగన్వాడీల సమ్మెకు సిఐటియు మండల అధ్యక్షులు నిమ్మకూరు రమేష్ బాబు మద్దతు తెలిపి ప్రసంగించారు. కార్యక్రమంలో నిమ్మకు రమేష్ బాబు, పొన్నూరు అంగన్వాడి యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.వి సుకన్య. డి పద్మజ. ప్రాజెక్ట్ లీడర్ పిడి విజయలక్ష్మి. సెక్టర్ లీడర్లు అనురాధ. సుజాత. కృష్ణకుమారి. అంగన్వాడిలు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-తాడేపల్లి**

తమ సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం ముందుకు రావాలని అంగన్‌వాడీలు తాడేపల్లి మంగళగిరి పాత జాతీయ రహదారిపై శనివారం రాస్తారోకోకు దిగారు. పెద్దఎత్తున అంగన్‌వాడీలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. తాడేపల్లి సిఐ మల్లికార్జునరావు, ఎస్‌ఐ రమేష్, 60 మంది పోలీసు సిబ్బంది పెద్దఎత్తున పోలీసు వాహనాలతో ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అరగంట సేపు రాస్తారోకో నిర్వహించడంతో ఇటు మంగళగిరి అటు విజయవాడ వైపు పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు వేముల దుర్గారావుతో సిఐ, ఎస్‌ఐ వాగ్వివాదానికి దిగారు. రాస్తారోకోకు అనుమతించేదిలేదని అరెస్టులు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు అన్నపరెడ్డి కోటిరెడ్డి, యూనియన్ గౌరవాధ్యక్షులు వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 40 రోజుల పాటు అంగన్‌వాడీలు చేస్తున్న పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొట్టె కరుణాకరరావు, వై.బర్నబస్, డివి భాస్కరరెడ్డి, కె.మేరి, ఐఎన్‌టియుసి నాయకులు సామ్యేలు, ఎఐటియుసి నాయకులు వెంకటయ్య, అంగన్‌వాడీలు ఎస్‌కె ఫాతిమ, తబిత, మాణిక్యం, కిరణ్మయి, శశిరాణి, సుజాత, నాగలక్ష్మి, నిర్మలాదేవి, అశ్విని, శ్రీదేవి, లీల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐద్వా తాడేపల్లి పట్టణ కార్యదర్శి పి.గిరిజ తమ దగ్గర ఉన్న రూ.2 వేలు అంగన్‌వాడీ పోరాటానికి నిధి అందజేశారు.

**ప్రజాశక్తి-తాడికొండ**

బెదిరింపులతో అంగన్వాడీల ఐక్యతను విచ్ఛిన్నం చేయలేరని ఫిరంగిపురం ప్రాజెక్టు లీడర్ ధనలక్ష్మి అన్నారు. శనివారం తాడికొండ పోలీస్ స్టేషన్ వద్ద 40 రోజులుగా చేస్తున్న సమ్మె శిబిరంను ఆమె సందర్శించి మాట్లాడారు. అంగన్వాడీల సమ్మెను నిర్వీర్యం చేసే కుట్రను సీడీపీఓ, సూపర్‌వైజర్లు ఆవలంబిస్తున్నారని అన్నారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా ఒక పక్క మంత్రులు మరో పక్క అధికారులు బెదిరిస్తున్నారని, ప్రమోషన్ లిస్టులో ఉన్నారని కొంతమంది కార్యకర్తలను ప్రలోబాలకు గురించేసి యూనియన్ ఐక్యతను దెబ్బ తీసేలా వారి చర్యలు ఉన్నాయన్నారు. సమ్మెను మరింత ఉధృతం చేసి తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను విరమించమని తేల్చి చెప్పారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నేతాజీ మాట్లాడుతూ ఉద్యోగాలనుండి తొలగించే అధికారం సీడీపీఓ లకు ఎవరిచ్చారని ప్రశ్నించారు, శనివారం ఉద్యోగాలలో చేరాలని లేకుంటే తొలగిస్తామని బెదిరుస్తున్నారని అన్నారు, ఈ బెదిరింపులకు అంగన్వాడీలు తగిన సమాధానం ఇస్తారని అన్నారు. కార్యక్రమంలో గాంధీ రాంమోహనరావు, భాస్కరరావు,రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి,షహీదా, నూర్జహన్,శాంతి తదితరులు పాల్గొన్నారు.

**అంగన్వాడీల నూతన కార్యవర్గం ఎన్నిక**

తాడికొండ మండల అంగన్వాడీల నూతన కమిటీ ఎంపిక శనివారం జరిగింది. అధ్యక్షులుగా పి విజయదుర్గ, కార్యదర్శి కె రాజకుమారి, ట్రెజరర్ ఏం ప్రేమకుమారి, సభ్యులుగా సిహెచ్ శాంతి, షేక్ శంషాద్, సామ్రాజ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సిఐటియు గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ కమిటీనుద్దేశించి ప్రసంగించారు.

రూ.10లక్షల చెక్కును అందజేస్తున్న బాబు ఆర్, డాక్టర్ రూప

## ఎన్ఆర్ఐ రూ.10లక్షల విరాళం

**ప్రజాశక్తి-తెనాలి**

జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో నిర్మించనున్న మాతా శిశుసంరక్షణ వైద్యశాలకు పట్టణానికి చెందిన ప్రవాస భారతీయులు డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి రూ.10లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. గుంటూరు మెడికల్ కళాశాల్లో ఎంబిబిఎస్ చదివిన 1964 బ్యాచ్ వైద్యులంతా శుక్రవారం బాపట్ల జిల్లా చీరాల ఓడరేవు ప్రాంతంలో సీ బ్రీజ్ రిసార్ట్సులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉత్తర అమెరికాకు చెందిన గుంటూరు మెడికల్ కాలేజ్ ఆఫ్ నార్త్ అమెరికా (జింఖానా) ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో గుంటూరు జిల్లా వైద్యశాల్లో 600 పడకలతో అత్యాధునికంగా నిర్మించే మాతా శిశు సంరక్షణ భవనానికి నిధులు సమకూర్చి ప్రభుత్వానికి అందించాలని తీర్మానించారు. అదే బ్యాచ్‌లో బాబు ఆర్ వడ్లమూడి సతీమణి డాక్టర్ వడ్లమూడి సీతారావమ్మ కూడా ఉన్న నేపథ్యంలో ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన బాబు అర్ వడ్లమూడి తన సతీమణి పేరిట కుమార్తె లక్ష్మీ రూపతో కలిసి రూ.10లక్షల చెక్కును జింఖానా ప్రతినిధులు డాక్టర్ కొత్తమాసు సాంబశివరావు, డాక్టర్ బుచ్చిబాబు పైడిపాటికి అందజేశారు. కార్యక్రమంలో 1964 గుంటూరు మెడికల్ కళాశాల్లో ఎంబిబిఎస్ చదివి, పలు దేశాల్లో వైద్యులుగా స్థిరపడిన బృందం పాల్గొన్నట్లు డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి తెలిపారు.

నివాళి అర్పిస్తున్న నాయకులు కె నళినికాంత్, ఎంఎ చిష్టి తదితరులు

## సిఐటియు నాయకులు హుస్సేన్‌వలి కన్నుమూత

**ప్రజాశక్తి-గుంటూరు**

స్థానిక గుజ్జనగుండ్ల ప్రాంతంలో సిఐటియు సీనియర్ నాయకులు షేక్. హుస్సేన్‌వలి శనివారం అనారోగ్యంతో మరణించారు. హుస్సేన్‌వలి భౌతిక ఖాయాన్ని ఆయన నివాసం వద్ద సిపిఎం పార్టీ గుంటూరు నగర కార్యదర్శి కె. నళినీకాంత్, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ.చిష్టీ సందర్శించి మూలమాల వేసి నివాళులర్పించారు. హుస్సేన్‌వలి జూట్ మిల్లులో సిఐటియు బలోపేతానికి ఎంతో కషి చేశారని అన్నారు. అలాగే గుజ్జనగుండ్ల ప్రాంతంలో సిపియం అభివృద్ధికి కృషి చేసినట్లు వారు తెలిపారు. తనతోపాటు, కుటుంబ సభ్యులు కూడా పార్టీలో చేరేందుకు ప్రోత్సహించారని చెప్పారు. హుస్సేన్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో ఆవాజ్ జిల్లా అధ్యక్షులు షేక్.భాషా, స్థానిక పార్టీ గుజ్జనగుండ్ల శాఖ సభ్యులు ఇ.వేమారెడ్డి, నగర కమిటీ సభ్యులు బి. సత్యన్నారాయణ, ఎస్.పద్మనాభుడు తదితరులు పాల్గొన్నారు.

క్యాబిన్లు పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి

## ఆధునీకరించిన హెచ్ సెక్షన్ ప్రారంభం

**ప్రజాశక్తి-గుంటూరు** :కలెక్టరేట్‌లో ఎన్నికలు, ప్రోటోకాల్ కోఆర్డినేషన్‌కు సంబంధించిన ఆధునీకరించిన హెచ్.సెక్షన్‌ను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి శనివారం ప్రారంభించారు. సెక్షన్‌లో సిబ్బందికి కేటాయించిన క్యాబిన్లను కలెక్టర్, జేసీ పరిశీలించారు.కార్యక్రమంలో డిఆర్ఓ కె.చంద్రశేఖర్‌రావు, కలక్టరేట్ ఏ.ఓ పూర్ణచంద్ర రావు, కలక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## టీచర్ల బకాయిలను వెంటనే చెల్లించాలి

**ప్రజాశక్తి - రెంటచింతల**

రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు బకాయి పడ్డ పిఎఫ్,పిఆర్సి, డిఏ,ఎస్ఎల్ లు సుమారు పదివేల కోట్ల వరకు ఉన్నాయని ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ మెంబర్ డాక్టర్ చిన్నమ్మ కోరారు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించి ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## కంది పంట యాజమాన్యంపై శిక్షణ

**ప్రజాశక్తి-బెల్లంకొండ**

బెల్లంకొండ మండలం మన్నెసుల్తాంపాలెం గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్యం వారి సౌజన్యంతో కంది పంట యాజమాన్యం,నాణ్యతా ప్రమాణాల పై రైతు శిక్షణా కార్యక్రమం జరిగినది.ఈ కార్యక్రమంనకు గ్రామ సర్పంచ్ దారం వెంకట నరసమ్మ రమణారెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమం లో ఎం. శివకుమారి(డీటీసీ )పల్నాడు జిల్లా శిక్షణ కేంద్రం కంది పంట లో కాయ ఈగ వలన కలిగే నష్టం వివరించారు.

## ప్రాంగణ ఎంపికలలో 'తిరుమల' విద్యార్థులకు ఉద్యోగాలు

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

ప్రఖ్యాత సదర్లాండ్ సాఫ్ట్వేర్ కంపెనీ శనివారం తమ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో తమ కళాశాలకు చెందిన 47 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని తిరుమల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి నారాయణ శనివారం ప్రకటనలో తెలిపారు. స్థానిక జొన్నలగడ్డ గ్రామ పరిధిలో గల తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో చెన్నైకి చెందిన బహుళ జాతి కంపెనీ సదర్లాండ్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో 320 మంది విద్యార్థులు పాల్గొనగా కంపెనీ నిర్వహించిన రాత పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు బృంద చర్చలు నిర్వ హించారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

## టిడిపికి మరోసారి గుణపాఠం తప్పదు : రజని

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

టిడిపికి మరోసారి గుణపాఠం తప్పదని, ప్రజలు ఓట్లతోనే సమా ధానం చెప్పేందుకు సిద్ధం గా ఉన్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 28వ వార్డు సీతమ్మ కాలనీ, అంకమ్మ తల్లి గుడి దగ్గరి నుంచి శనివారం సాయంత్రం పర్యటించారు. ఆమెకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దారిపొడవునా పూల వర్షం కురిసింది. 28వ డివిజన్‌లోని అన్ని వీధుల్లో మంత్రి కలియతిరిగారు. స్థానిక ప్రజలతో సమస్యలపై చర్చించారు. రజిని మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ చంద్రబాబునాయుడు చేసే కుట్రలు, కుతంత్రాలు ఏ స్థాయిలో ఉంటాయో ప్రజలందరికీ తెలుసని పేర్కొన్నారు. తెలుగుదేశంపార్టీకి అధికారంలో ఉన్నన్ని రోజులు ప్రజలే గుర్తురారని, ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ ప్రజలపై కపట ప్రేమను చూపిస్తున్నారని మండిపడ్డారు. గుంటూరు నగర అభివద్ధిలో ఇప్పటికే తమ ప్రభుత్వం ప్రత్యేక ముద్ర వేసుకుందని తెలిపారు. స్థానిక కార్పొరేటర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

పల్నాడు జిల్లాలో 35 వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో రహదారి భద్రతకు సంబంధించిన ప్రచార బ్యానర్స్ మరియు పోస్టర్స్ ను ఆయన విడుదల చేశారు. రహదారి భద్రత మాసోత్సవాలు శనివారం నుండి వచ్చే నెల 19 వరకు జరుగుతాయని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి యేటా 8 వేల మంది ప్రమాదాల బారిన పడి మరణిస్తున్నారని, ఈ సంఖ్య తగ్గించాల్సిన అవసరం ఉందని రహదారి భద్రత అందరి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి లో రహదారి భద్రత పై అవగాహన పెరగాలని రహదారి భద్రతలో అనుబంధ శాఖలు రవాణా, పోలీస్, రహదారి ఇంజనీరింగ్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో కలసి పని చేయాలని అన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ కె. వినాయకం, జిల్లా రవాణా శాఖ అధికారి టి. కె. పరందామ రెడ్డి, డి.ఎస్.పి. కెవి మహేష్, ఆర్ అండ్ బి ఇ.ఇ రాజా నాయక్, పంచాయతీ రాజ్ డి.ఇ నాగేశ్వర బాబు పాల్గొన్నారు.

**ఓటు హక్కు కల్పించాలి**

ప్రత్యేక సారాంశ సవరణ-2024 కార్యక్రమంలో రాజకీయ పార్టీల అభ్యంతనలను సకాలంలో పరిష్కరించి తగు వివరణలను ఇవ్వాలని కలెక్టర్ శివ శంకర్ అన్నారు. స్థానిక నరసరావుపేట కలెక్టర్ కార్యాలయం విడియో కాన్ఫరెన్స్ హాలు నుండి మండల అధికారులు, రెవిన్యూ డివిజినల్, మునిసిపల్ అధికారులతో ప్రత్యేక సారాంశ సవరణ-2024 పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ.పి రేషియో పెంచాలా చూడాలని, వికలాంగులను గుర్తించి వారికి ఓటు హక్కు కల్పించాలన్నారు. 18 ఏళ్ళు నిండిన వారికి ఓటు హక్కు కల్పించేలా చూడాలని ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు వేగవంతంగా చేయాలని ఆదేశించారు. ఈ నెల 22 న తుది జాబితా విడుదల చేయనున్న నేపథ్యంలో దానికి అవసరమైన అన్ని పనులు సజావుగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ నెల 25 న ఓటర్స్ డే సందర్భంగా ప్రత్యేక కారక్రమాలు నిర్వహించి ప్రజలలో ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని సూచించారు.

**ప్రభుత్వ కార్యక్రమాలపై ఆరా**

ప్రభుత్వ సంక్షేమ, అభివద్ధి పథకాలపై కలెక్టర్ శివ శంకర్ ఆరా తీశారు. ప్రభుత్వ పథకాలను పల్నాడు జిల్లాలో ఏ విధంగా అమలు చేస్తున్నారు అనే దానిపై కమాండ్ కంట్రోల్ సిబ్బందితో డాక్టర్. బి.ఆర్ అంబేద్కర్ స్పందన హాల్లో సమావేశం జరిగింది.ప్రభుత్వ పథకాలైన అమలు ప్రక్రియ "ఆడుదాం ఆంధ్రా" జగనన్న ఆరోగ్య సురక్ష, జగనన్న కార్డుల పంపిణీ, జగనన్నకు చెబుదాం "స్పందన" కార్యక్రమం కుల గణన సర్వే తదితర కార్యక్రమాలపై కమాండ్ కంట్రోల్ స్టాఫ్ ఏ విధంగా పనిచేస్తున్నారనే దానిపై ఆరా తీశారు.పల్నాడు జిల్లా ఖ్యాతిని రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉంచాలన్నది తమ లక్ష్యమని అన్నారు, అందులో భాగంగానే కమాండ్ కంట్రోల్ ను కలెక్టరేట్ లో ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో డి.డి.ఓ మహాలక్ష్మి, ఎంపీడీవో షేక్. గౌస్య బేగం, జిల్లాలోని అన్ని మండలాల కమాండ్ కంట్రోల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతకు సంబంధించిన ప్రచార బ్యానర్స్, పోస్టర్స్ ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

**జర్నలిస్టుల నివేశన స్థల సేకరణ వేగవంతం**

రాష్ట్ర ప్రభుత్వం సూచించిన విధంగా పాత్రికేయులు నివేశన స్థలాల విషయమై త్వరితగతిన భూ సేకరణ చేపట్టాలని కలెక్టర్, సంబంధిత అధికారులను ఆదేశించారు. నరసరావుపేట స్థానిక కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు, కమిటీ సభ్యులతో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరు పై కమిటీ తొలి విడత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 213 దరఖాస్తులు ఆన్లైన్లో వచ్చాయని అందులో నరసరావుపేట డివిజన్లో 154, గురజాల డివిజన్లో 25 అదేవిధంగా సత్తెనపల్లి రెవిన్యూ డివిజన్లో 34 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. సదరు దరఖాస్తులను త్వరితగతిన నిశితంగా పరిశీలించి నివేదికను సిద్ధం చేయాలన్నారు. దీనికి సంబంధించి అవసరమైన భూసేకరణ పనులు త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. కార్య క్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి కె. వినాయకం, కమిటీ సభ్యులు ప్రజాశక్తి విలేకరి పచ్చవ బుజ్జిబాబు, సాక్షి పల్నాడు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లవ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## సాగర్ కుడికాలువకు నీటి నిలిపివేత

**ప్రజాశక్తి-విజయపురిసౌత్**

నాగార్జునసాగర్ కుడికాలువకు శనివారం నీటిని నిలుపుదల చేశారు. కష్ణానది యాజమాన్య బోర్డు ఈ నెల 8న తాగు నీటి అవసరాల నిమిత్తం 5 టీఎంసీల నీటిని నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడికాలువకు కేటాయించారు. ఉదయం కుడికాలువకు విడుదలవుతున్న 4,940 క్యూసెక్కులను గంటకు 1,000 క్యూసెక్కుల చొప్పున తగ్గిస్తూ 10 గంటలకు పూర్తిస్థాయిలో నీటి విడుదలను నిలిపివేశారు. ప్రస్తుతం సాగర్ జలాశయ నీటి మట్టం 520.30 అడుగుల వద్ద ఉంది.

## ఎన్నికలకు సిద్ధంకండి: టిడిపి

**ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్**

ఎన్నికల నోటిఫికేషన్ ఫిబ్రవరిలో వచ్చే అవకాశం ఉన్నందున టిడిపి నాయకులు కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సత్తెనపల్లి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి కన్నా లక్ష్మీనారాయణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సత్తెనపల్లి రఘురాం నగర్లోని టిడిపి ప్రజా వేదికలో టిడిపి అనుబంధ కమిటీల అధ్యక్ష కార్యదర్శులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కన్నా లక్ష్మి నారా యణ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను గ్రామగ్రామాన ప్రజలకు వివరించాలని విజ్ఞప్తి చేశారు.

# 'టిడిపి నాయకుల కళ్ళు మండిపోతున్నాయి'

**ప్రజాశక్తి-వినుకొండ**

విజయవాడలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ చూసి తెలుగుదేశం పార్టీ నాయకులు కళ్ళు మండిపోతు న్నాయని, పొన్నూరు టిడిపి ఇన్చార్జి నరేంద్ర ఆ విగ్రహాన్ని కూలగొట్టి అమరావతిలో నిర్మిస్తామని చెప్పడం చూస్తే ఇంతకు మించిన దళిత ద్రోహులు ఎవరుంటారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, టిడిపి నాయకులు దళితులను అణగదొక్కి అణగారిన వర్గాలుగా వారిని చూసి పాలన సాగించినట్లు చెప్పారు. వైసిపి పాలనలో మాత్రమే న్యాయం జరిగిందని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు అంటున్నారని అన్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని చూసి టిడిపి వాళ్లు ఎంత అసూయతో మాట్లాడుతున్నారో ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. టిడిపి హయాంలో చేసిన అభివద్ధి ఏమైనా ఉంటే చెప్పాలి. అలాగే అధికారంలోకి వస్తే ఏం చేస్తామో చెప్పాలి. కానీ నిత్యం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మీద టిడిపి నాయకులు విషం చిమ్మటం తప్ప వాళ్ళు చేస్తున్నది ఏమీ లేదన్నారు. దళిత ద్రోహి జగన్ అని టిడిపి నాయకుల చేస్తున్న ఆరోపణలను ఖండించారు. వాస్తవానికి దళిత ద్రోహులు చంద్రబాబు , లోకేష్ లు మాత్రమే అన్నారు. అంబేద్కర్ ఆశయాల్లో అడుగుజాడల్లో నడుస్తున్నామని జీవీ ఆంజనేయులు చెప్పడం విచిత్రంగా ఉందన్నారు.

## కుల గణన సర్వే పరిశీలన

**ప్రజాశక్తి-రెంటచింతల**

మండలంలోని మల్లవరం గ్రామంలో జరుగుతున్న కుల గణన సర్వేను డిడిఓ మండల స్పెషల్ ఆఫీసర్ మహాలక్ష్మి పరిశీలించారు ప్రతి కుటుంబం ఎందుకు సంబంధించిన వివరాలను అధికారులకు అందజేయాలన్నారు కాగా జెట్టిపాలెం గ్రామంలో కుల గణన జరుగుతున్నట్టు తెలిపారు.

## మహిళా ఉద్యోగులకు షటిల్ పోటీలు

**ప్రజాశక్తి- రెంటచింతల**

రానున్న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్రశాలలోనే నాగార్జునసాగర్ టైల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు క్రీడా ప్రాంగణంలో రెండో రోజు అయిన శనివారం మహిళా ఉద్యోగులకు షటిల్ పోటీలునిర్వహించినట్లు ఎస్ ఇ వెంకటరమణ తెలిపారు నాలుగు రోజులపాటు వివిధ రకాల క్రీడల్లో పోటీలు ఉంటాయన్నారు.

## దళితులను విదేశీ విద్యకు దూరం చేసిన సిఎం

**ప్రజాశక్తి-రెంటచింతల**

దళితులు విద్యాపరంగా ఉన్నత స్థానాలకు వెళ్తారనే అక్కసు తో అంబేద్కర్ విదేశీ విద్య పేరు మార్చి జగనన్న విదేశీ విద్యగా పేరు మార్చి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను సీఎం జగన్మోహన్ రెడ్డి ఘోరంగా అవమానించారని టిడిపి ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మామిడి రవి విమర్శించారు శనివారం మండల కేంద్రమైన రెంటచింతలలోనే అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లే కార్డులతో నిరసన తెలిపారు అనంతరం ఆయన మాట్లాడుతూ విజయవాడలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసి ఎస్సీలను 125 అడుగుల లోతుకు తొక్కారని దుయ్యబట్టారు.ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు డేగల జ్ఞానయ్య, కుక్క మూడు ఏసోబు, డేగల తామస్ డేగల అబ్రహం పాల్గొన్నారు.

# శుద్ధజలం అందించడంలోనూ వివక్ష

- దళితవాడల్లో పరిష్కారం కాని సమస్య
- డయేరియాతో బాలిక మృతి ఘటన జరిగినా జాప్యం
- ఏడాదిన్నరగా సాగతీత ధోరణిలో పనులు

ప్రజాశక్తి-తెనాలి

దళితవాడల్లో ఎంతటి ప్రమాదకర పరిస్థితులున్నా అధికారులు, ప్రజాప్రతినిధుల స్పందన మాత్రం అంతంతమాత్రమే. మృత్యుఘంటికలు మోగినా, మృత్యువాతపడినా కనికరం కరువే. చేద్దాంలే... చూద్దాంలే తప్ప పరిస్థితిని చక్కదిద్దే క్రమంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యమే. దీనికి తాజా ఉదాహరణగా రూరల్ గ్రామం కొలకలూరులో చేపట్టిన రక్షిత మంచినీటి పథకమే. ఏడాదిన్నర క్రితం గ్రామంలో తాగునీరు కలుషితం కారణంగా డయేరియా సోకి బాలిక మృతి చెందటం, దాదాపు 200 మంది అస్వస్థతకు గురైన ప్రత్యేక పరిస్థితుల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రతిపాదించిన జల్‌జీవన్ మిషన్ పనుల్లో తీవ్రజాప్యం నెలకొంది.

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి గ్రామానికి రక్షిత మంచినీరు అందించాలని తలపెట్టింది. 2024 నాటికి అన్ని గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇవ్వాలన్నది లక్ష్యం. దానిలో భాగంగానే రూరల్ గ్రామం కొలకలూరుకు కూడా జల్‌జీవన్‌మిషన్ కార్యక్రమంలో ఇంటింటికీ కుళాయి అందించాలన్న లక్ష్యంతో రూ.1.33కోట్లు నిధులు మంజూరయ్యాయి. అయితే కాంట్రాక్టర్లు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో పనులు చేపట్టలేకపోయామని అధికారులు చెబుతున్నారు.

పైప్‌లైన్ నుంచి ఇచ్చిన కుళాయి కనెక్షన్లు , తవ్వేసిన రోడ్డు మార్జిన్

నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంక్

## కొలకలూరులో ప్రత్యేక పరిస్థితులు..

రూరల్ గ్రామం కొలకలూరులో కొన్ని ప్రత్యేక పరిస్థితులు ఎదురయ్యాయి. దాదాపు ఏడాదిన్నర క్రితం 2022 జూన్ 29న గ్రామంలోని ఎస్సీ కాలనీలో తాగునీరు కలుషితమై డయేరియా ప్రభలింది. రాత్రికి రాత్రే బాలిక చనిపోవటం, పెద్ద ఎత్తున ప్రజలు వాంతులు, విరోచనాలతో ఆసుపత్రిపాలయ్యారు. అధికారులు తక్షణం స్పందంచారు. ఎస్సీ కాలనీలో దాదాపు 40 ఏళ్ళ క్రితం ఏర్పాటు చేసిన పైప్‌లైన్ నుంచి తాగునీటిని పూర్తిగా నిలిపివేశారు. 45 రోజుల పాటు ట్యాంకర్లద్వారా రక్షిత మంచినీటిని ఇంటింటికీ సరఫరా చేశారు. ఈ పరిస్థితుల్లో పైప్‌లైన్ మొత్తం మార్చాలని, పైప్‌లైన్ లీకేజికి తోడు, సమీపంలోని కాఫీ ప్యాక్టరీ వ్యర్థాలు కూడా కలిసి, ప్రజల ప్రాణాలకు ముప్పుతెచ్చిందని స్థానికులు గగ్గోలు పెట్టారు. లోకాయుక్తతో పాటు ఎస్సీ కమిషన్‌కు కూడా పిర్యాదు చేశారు. మరమ్మతులతో సరిపెట్టాలని అధికారులు చూసినా, పూర్తిగా పైప్‌లైన్ మార్చాల్సిందేనని, ప్రత్యేకంగా ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని ప్రజలు పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో అప్పటివరకూ స్పందనలేని జల్‌జీవన్‌మిషన్ పథకాన్ని అమలు చేసేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఎలాగైతేనేం రక్షిత మంచినీటి సరఫరాకు అవసరమైన పనులు చేపట్టారు.

## నత్తనడకనే పనులు

ఎంతో అత్యవసర పరిస్థితుల్లో పనులు చేపట్టినా తీవ్ర జాప్యం నెలకొంది. ఎస్సీ కాలనీలో డయేరియా సోకి ఏడాదిన్నర దాటినా పనులు మాత్రం నత్తనడకనే సాగుతున్నాయి. 45 రోజులు ట్యాంకర్ల ద్వారా రక్షిత మంచినీటని సరఫరా చేసినా, ప్రస్తుతం పాత పైప్‌లైన్ ద్వారానే నీటి సరఫరా జరగుతోంది. అప్పుడప్పుడూ మురుగు నీరు కూడా దర్శనమిస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో పనులు జాప్యంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఎస్సీ కాలనీలో పైప్‌లైన్ వేశారు. దాదాపుగా ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. ట్యాంకు నిర్మాణంలో మాత్రం జాప్యం జరుగుతోంది. అలాగే పైప్‌లైన్ కోసం తవ్విన గుంతలు పూడ్చ లేదు. ఈ నేపథ్యంలో రెండు నెలల్లో పనులు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నా, అది ఏ మేరకు సాధ్యమన్నది ప్రశ్నార్థకమే. జాప్యంపై ప్రశ్నిస్తే అన్ని గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ నిధులు మంజూరైనా, కొలకలూరులో మాత్రమే పనులు జరుగుతున్నాయి. సంతోషించండి అన్న చందంగా సమాధానమిస్తున్నారు.

## మండలాభివృద్ధికి సమిష్టి కృషి

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న ఎంపిపి పద్మావతి

గుంటూరు మండల ప్రజాపరిషత్ సర్వ సభ్య సమావేశం శనివారం స్థానిక మండల కార్యాలయంలో నిర్వహించారు. ఎంపిపి ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఇటీవల ఆరోగ్యశ్రీ కార్డులపై వైద్య పరిమితి రూ.5 లక్షల నుండి రూ.25లక్షలకు పెంచిన తర్వాత జారీ చేసిన కార్డులను లబ్దిదారులకు అందచేయాలన్నారు. ఆరోగ్య సురక్ష క్యాంపులను, కులగణనను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీటిసి తుమ్మల సుబ్బారావు, ఎంపిడిఒ ఎస్.ఆదినారాయణ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు, సెక్రెటరీలు పాల్గొన్నారు.

## అమరావతి దళిత జెఏసి కన్వీనర్ గడ్డం మార్టిన్ మృతి

**ప్రజాశక్తి - తుళ్లూరు :** అమరావతి దళిత జెఎసి కన్వీనర్, టిడిపి నాయకులు గడ్డం మార్టిన్ లూథర్ (52) శనివారం గుండె పోటుతో మరణించారు. రాజధాని ప్రాంతం మందడం గ్రామానికి చెందిన మార్టిన్‌కు గుండెపోటు రావడంతో మణి పాల్ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతు పరిస్థితి విషమించి కన్నుమూశారు. దళిత జెఎసి కన్వీనర్‌గా మార్టిన్ అమరావతి ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. అసైన్డ్ రైతుల సమస్యపై నిరంతరం పోరాడారు. మార్టిన్ మృతి పట్ల రాజధాని అమరావతి రైతులు, దళిత, మైనార్టీ జెఎసి, సిపిఎం రాజధాని డివిజన్ కమిటి నాయకులు ఎం రవి, ఎం భాగ్యరాజు విచారం వ్యక్తం చేశారు.

## టిసిఎస్‌లో ఏఎస్ఎన్ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి తెనాలి

పట్టణానికి చెందిన ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీ టిసిఎస్‌లో ఉద్యోగాలు పొందారు. ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్ అన్నాబత్తుని శివకుమార్ శనివారం కళాశాలలో వెల్లడించిన వివరాల ప్రకారం ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీ టిసిఎస్ సంస్థ డిజిటల్ ట్రాన్స్ ఫార్మేషన్ అండ్ బిజినెస్ ప్రాసెస్ సర్వీసెస్ విభాగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఇటీవల క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించింది. ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొన్న విద్యార్థులలో కళాశాలకు చెందిన 144 మంది ఉద్యోగాలు పొందారు. టిసిఎస్ సంస్థ యాజమాన్యం ఎంపిక పత్రాలను విద్యార్థులకు శివకుమార్ అందజేశారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. క్యాంపస్ సెలక్షన్లలో ఎంపిక నిమిత్తం వారిని అన్ని విధాలుగా తీర్చిదిద్దిన ప్రిన్సిపల్ డాక్టర్ కె రామచంద్ ను అభినందించారు. కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు

## 60 మందికి ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ

ప్రజాశక్తి మంగళగిరి

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వడంతో పాటు స్వయం ఉపాధికి మార్గం చూపేందుకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తున్నారని నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి అన్నారు. తాడేపల్లి టౌన్, తాడేపల్లి రూరల్ మండలానికి చెందిన మహిళలు నిపుణుల పర్యవేక్షణలో శిక్షణ పొందారు. కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మంగళగిరి నియోజకవర్గ కార్యాలయంలో తెలుగు మహిళలు శనివారం సర్టిఫికెట్లు, కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. 40వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన 60 మంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, నియోజకవర్గ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మంచికలపూడి వైష్టవి, తాడేపల్లి పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ కొయ్యగూర మహాలక్ష్మి, తాడేపల్లి పట్టణ తెలుగు మహిళ అధ్యక్షురాలు అన్నె కుసుమ, తాడేపల్లి మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు బొర్రా కృష్ణ వందన తదితరులు పాల్గొన్నారు.

## అదనపు చార్జీల పేరుతో ఇసుక బాదుడు

### బిల్లులు లేకుండా బాట చార్జీల పేరుతో వసూలు

**ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్ :** నూతన ఇసుక పాలసీలో వాహనదారుల దగ్గర నుండి బాట చార్జీల పేరుతో అదనపు రుసుమును వసూలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన టన్ను ఇసుకకి రూ.375కు రూ.వంద అదనం కలిపి ఇప్పటివరకు రూ.475 వసూలు చేస్తుండగా, శనివారం నుండి ఎంటి ఎంసీ పరిధిలోని గుండి మెడ ఇసుక క్వారీలలో గుత్తేదారులు బాట చార్జీల పేరుతో మరొక వంద రూపాయలతో కలిపి ఏకంగా 575 శనివారం నుండి ఇసుక వాహనదారులను ముక్కు పిండి మరియు వసూలు చేస్తున్నారు. అదేమని ప్రశ్నించిన వాహనదారులతో వాదనకు దిగుతున్నారు. అంతేకాకుండా ఇసుక బిల్లులు ఇవ్వకుండానే, పది చక్రాల లారీకు రూ.1500 , ఆరు చక్రాల లారీకి వెయ్యి రూపాయలు, ట్రాక్టర్ కు రూ.500 ఇవ్వాల్సిందే అని హుకుం జారీచేస్తున్నారు. ఇసుక దందా ఇదే విధంగా కొనసాగితే, ఈ ప్రభావం వినియోగదారులపై పడి గృహ నిర్మాణదారులు ఇబ్బందులు పడే పరిస్థితి నెల కొంటుంది.

గుండెమెడ ఇసుక క్వారీలలో నిలిచిన ఇసుక లారీలు

హెసిఎల్‌కు ఎంపికైన విద్యార్థులతో లక్ష్మీప్రియాంక, శ్రీనివాసరావు

## వైష్ణవి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-తెనాలి

పోటీ ప్రపంచంలో విద్యార్థులు జాబ్ ఓరియెంటెడ్ ఎర్లీ కెరీర్ ప్రోగ్రామ్స్‌పై శ్రద్ద చూపాలని, దానికి అనుగుణంగా చదువుతో పాటు ఉద్యోగాలు పొందవచ్చునని ఇస్రో సైంటిస్ట్ లక్ష్మీ ప్రియాంక చెప్పారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కళాశాల్లో ఇంటర్ చదువుతూ హెచ్‌సిఎల్ కంపెనీలో కెరీర్ ఓరియెంటెడ్ ప్రోగ్రామ్‌కు ఎంపికైన విద్యార్థుల అభినందన సభలో ఆమె ముఖ్య అతిదిగా పాల్గొన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పాటిబండ్ల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఇంటర్ స్థాయిలోనే కెరీర్ ఓరియెంటెడ్ ప్రోగ్రామ్స్‌పై విద్యార్థులకు ఆసక్తి కల్పిస్తూ, వారు త్వరిత గతిన ఉపాది పొందేలా ప్రోత్సహిస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలు నిర్వహించే కెరీర్ ఓరియెంటెడ్ ప్రోగ్రామ్స్‌పై అవగాహన పెంచుకుంటే ఇంటర్ పూర్తి కాగానే ఉద్యోగం పొంది, ఉద్యోగంతో పాటు మెరుగైన విశ్వవిద్యాలయాల్లో కోరుకున్న డిగ్రీ కూడా చదివే అవకాశం ఉందన్నారు. కళాశాల్లో ఇంటర్ చదివిన ఆకాష్, కొండలరావు, సంజయ్, మోక్షిత, దుర్గాభవాని, సాయిభారతి, రమ్యజ్యోతి మొత్తం ఏడుగురు విద్యార్థులు 2021-2023 సంవత్సరానికి హెసిఎల్ కంపెనీలో కెరీర్ ఓరియెంటెడ్ ప్రోగ్రామ్‌కు ఎంపికైనట్లు చెప్పారు. వారిని ఇస్రో సైంటిస్ట్ లక్ష్మిప్రియాంక చేతుల మీదుగా అభినందించారు. అనంతరం కళాశాల తరపున లక్ష్మిప్రియాంకను కూడా సత్కరించారు.

## చంద్రబాబును కలిసిన 'మన్నెం దంపతులు'

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయం ఎన్టీఆర్ భవన్లో టీడీపీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును మంగళగిరికి చెందిన మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్ బాబు, తెలుగు మహిళ నాయకురాలు శ్రీమతి మన్నెం అనిత దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వర్గీయ ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని తాము చేపట్టిన సేవా కార్యక్రమాల గురించి వారు చంద్రబాబు నాయుడుకు వివరించారు. ఈ సందర్భంగా మన్నెం దంపతులను చంద్రబాబు నాయుడు అభినందించారు.

## 'రాష్ట్రంలో ముగియనున్న దుష్టపాలన'

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి నియోజకవర్గంలో టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి ఎవరైనా భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు శనివారం జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలిపారు. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో వైసిపి దుష్టపాలనను అంతమందించేందుకు జనసేన కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. తాను వైసీపీలోకి వెళుతున్నట్లుగా వచ్చిన ప్రచారం అవాస్తమని తెలిపారు. జనసేనలోనే కొనసాగుతానని, మంగళగిరి అభ్యర్థి లోకేష్‌ను గెలిపించుకుంటామని తెలిపారు. జనసేన పార్టీలో ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు. మంగళగిరి నియోజకవర్గంలో రెండు పార్టీలు కలిసి ప్రజలకు ఏమి చేయాలని దానిపై ఉమ్మడి మేనిఫెస్టోను రూపొందిస్తామని తెలిపారు. సమావేశంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బి విజయ శేఖర్, మహిళా నాయకురాలు బి కోమలి, జనసేన పార్టీ నాయకులు వాసా శ్రీనివాసరావు, ఎన్ నాగేశ్వరావు, జి మధు తదితరులు పాల్గొన్నారు.

## 22న లెనిన్ జీవితంపై పుస్తకావిష్కరణ సభ

ప్రజాశక్తి-గుంటూరు

వి.ఐ.లెనిన్ శత వర్ధంతి సందర్భంగా ఈనెల 22న స్థానిక బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 6గంటలకు 'విప్లవ సారధి లెనిన్, జీవితము-కషి' అనే గ్రంధాన్ని ఆవిష్కరించనున్నట్లు జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పుస్తకావిష్కరణ సభలో మార్క్సిస్టు పత్రిక సంపాదకులు, యస్.వెంకటరావు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, విరసం నాయకులు సి.యస్.ఆర్.ప్రసాద్, భారత రాజ్యాంగ పరిరక్షణ వేదిక జిల్లా అధ్యక్షులు యస్.హనుమంతరెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. మార్క్సిజం పిడిసూత్రం కాదని, ఆచరణకు మార్గదర్శి అని నిరూపించి, సోవియట్ విప్లవాన్ని జయప్రదం చేసిన గొప్ప మేధావి లెనిన్ అని అన్నారు. నేటి రాజకీయ పరిస్థితిలో ఆయన రచనలను విస్తతంగా ప్రజల్లోకి తీసువెళ్ళాలని, దీనిలో భాగంగానే ప్రజాశక్తి బుక్‌హౌస్, ప్రచురించిన పుస్తకావిష్కరణ సందర్భంగా జరిగే సభను జయప్రదం చేయాలని కోరారు.

## కలెక్టరేట్‌లో ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్

కలక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరం వద్ద రూ.7లక్షలతో కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ ప్లాంట్ ద్వారా శుద్ధి చేసిన మంచి నీటి నాణ్యతను కలెక్టర్, జేసీ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్లాంట్‌కు గంటకు 500 లీటర్ల శుద్ధ నీటిని అందించగల సామర్థ్యం ఉందన్నారు. ఇప్పటి వరకు కలక్టరేట్‌కు తాగునీటి వసతి కొరకు క్యాన్ల ద్వారా నీటిని తెప్పించి వినియోగించడం జరుగుతుండేది అన్నారు. ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమానికి వచ్చే ప్రజలతో పాటు కలక్టరేట్ సిబ్బందికి తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఈ ప్లాంట్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ కె.చంద్రశేఖర్‌రావు, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఎస్.ఈ సురేష్, కలక్టరేట్ ఏ.ఓ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 10,11 చెకుముకి సైన్స్ సంబరాలు

### విజయవంతం చేయాలని జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ పిలుపు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ గేయానంద్ తదితరులు

ఫిబ్రవరి 10, 11 తేదీల్లో పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ పిలుపిచ్చారు. శనివారం చిలకలూరిపేటలోని సిద్దయ్య విజ్ఞాన కేంద్రంలో జెవివి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జనవిజ్ఞాన వేదిక 36 ఏళ్ళుగా ముఢనమ్మకాలకు వ్యతిరేకంగా కృషి చేస్తూ అనేక విజయాలు సాధించిందని తెలిపారు. మూఢ విస్వాసాలు తొలిగినప్పుడే దేశం అన్ని రంగాల్లో విజయం సాధిస్తుందన్నారు. చిలకలూరిపేటలో నిర్వహించే రాష్ట్ర స్థాయి చెకుముని సైన్స్ సంబరాలను జయప్రదం చేయాలన్నారు. అనంతరం సైంటిఫిక్ టెంపర్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్న సాధినేని చౌదరయ్య పబ్లిక్ స్కూల్ ను పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, అల్ ఇండియా సైన్సు నెట్‌వర్క్ సభ్యులు శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సోషల్ మీడియా కన్వీనర్ జయప్రకాష్, పల్నాడు జిల్లా అధ్యక్షులు దార్ల బుజ్జిబాబు, ట్రెజరర్ ఎస్. చలపతిరావు, జిల్లా యూత్ అస్యక్షులు రమేష్, స్థానిక డివిజన్ అధ్యక్షు రాలు సిహెచ్ సృజన, ఉన్నవ రాజే ష్, ట్రెజరర్ రహీం తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నీ వ్యాధి బాధిత విద్యార్థినికి వేద సీడ్స్ ఆర్థిక సాయం

విద్యార్థినికి నగదు అందచేస్తున్న ధర్మచరణ్

ప్రజాశక్తి-గుంటూరు :గుంటూరుకు చెందిన బి.టెక్ విద్యార్థిని స్వాతికి రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయన్న విషయం వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించారు. ఆమెకు సంవత్సరం పాటు వైద్య ఖర్చులకు, చికిత్సలకు అయ్యే రూ.73,200లను ధర్మచరణ్ శనివారం వేద సీడ్స్ కార్యాల యంలో అందచేశారు. ఈ సందర్భంగా ధర్మచరణ్ మాట్లాడుతూ సన్నిహితుల ద్వారా స్వాతి పరిస్థితి తెలిసిందని, చదువుకునే వయసులో కిడ్నీ వ్యాధి బారిన పడటం ఎంతో బాధాకరమైన విషయమన్నారు.ఈ పరిస్థితుల్లో స్వాతి చదువుకుంటూ ధైర్యంగా జీవించడం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం అని అభినందించారు. భవిష్యత్‌లో ఇతర వైద్య ఖర్చులకు, కిడ్నీ మార్పిడి సమయాల్లో కూడా ఆర్థికంగా చేయూత నందిస్తానని ధర్మచరణ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గుర్రాల రంగారావు, వడ్లమూడి రవి, స్వాతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధులపై మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు :ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల విధులలో పాల్గొనడం ఒక గొప్ప క్రతువు అని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణకు సంబంధించి నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జేసీ జి.రాజకుమారి పాల్గొన్నారు. ఈ శిక్షణలో డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ హరిహరనాథ్ శిక్షణా తరగతులు నిర్వహించారు. శిక్షణలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ , ఎన్నికల వ్యయం పర్యవేక్షణ, మీడియా సర్టిఫికేషన్, పెయిడ్‌న్యూస్ , సోషల్ మీడియా- ఫేక్ న్యూస్ అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది.కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనను ఆకళింపు చేసుకొని ఎన్నికల విధులు నిర్వహించాలని తెలిపారు. శిక్షణలో డిఆర్‌ఓ కె.చంద్రశేఖరరావు, కోఆపరేటివ్ జిల్లా కోఆర్డినేటర్ వీరాచారి,తదితరులు పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు : గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో ప్రణాళికతో కషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లు, జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారితో కలసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలకు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు, అతిధులు, ఆహ్వానితులకు , విద్యార్థులకు, ప్రజలకు వెర్వేరుగా సీటింగ్ ఏర్పాట్లు, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ప్రశంసా పత్రాలు అందించటం, ప్రభుత్వ శాఖల స్టాల్స్ ఏర్పాటుపై సూచనలు చేశారు. ప్రభుత్వ శాఖలలో అమలు జరుగుతున్న పథకాలను ప్రతిబింబించేలా శకటాలను రూపొందించాలని, పెరేడ్ గ్రౌండ్‌లో శకటాల ప్రదర్శన తరువాత వాటిని ప్రజల సందర్శనార్థం నగరంలోని ప్రధాన రహదారులలో ర్యాలీ నిర్వహించాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన విధంగా జనవరి 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, చిత్రలేఖనం , వకత్త్వ పోటీలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఓ కె.చంద్రశేఖర్‌రావు, డిప్యూటీ కలెక్టర్ కే.స్వాతి , ఆర్డీఓ శ్రీఖర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణపై విస్తృత అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి తదితరులు

జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు భద్రత నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించటంతో పాటు, నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి రవాణా, పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం కలక్టరేట్‌లో జరిగిన జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారితో కలసి పాల్గొన్నారు.కలెక్టర్ మాట్లాడుతూ 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు జనవరి 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 19వ తేది వరకు నిర్వహిస్తున్న నేపథ్యంలో రహదారి భద్రత నిబంధనలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగేలా ప్రచార కార్యక్రమాలతో పాటు, విద్యాసంస్థల్లో, ఇతర ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించాలన్నారు. కళాశాలలోని ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులకు, స్వచ్ఛంధ సేవా సంస్థల ప్రతినిధులకు రహదారి భద్రత నిబంధనలపై అవగాహన కోసం శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి, వారి ద్వారా విస్తత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రహదారి భద్రత నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తించేం దుకు రవాణా, పోలీస్ శాఖలు సంయుక్తంగా నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. కంకరగుంట ఓవర్ బ్రిడ్జ్‌కి ఇరువైపుల రహదారి ప్రమాదాలను నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్, రవాణా, ఆర్‌అండ్‌బి అధికారులు సంయుక్తంగా పరిశీలన చేసి నివేదిక అందించాలన్నారు. నగరంలోకి కాంట్రాక్టు క్యారేజీ బస్సులు ప్రవేశించకుండా బుడంపాడు, ఆటోనగర్ వై జంక్షన్ వద్ద నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఆటోలను క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశం అనంతరం కలెక్టరేట్ ఆవరణలో 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు సందర్భంగా రహదారి భద్రతా నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించటానికి రూపొందించిన ప్రచారం పోస్టర్లు, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించి, ప్రచార వాహనంను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రాంతీయ సంయుక్త రవాణా కమిషనర్ కృష్ణవేణి, జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్. కరీం, ఆర్ అండ్ బి ఎస్.ఈ ఆర్ శ్రీనివాస మూర్తి, ఎన్ హెచ్ ఏ ఐ పీడీ పి. పార్వతీశం , డియం అండ్ హెచ్ ఓ డాక్టర్ విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి నేతలను వెంటాడుతున్న అసమ్మతి

సార్వత్రిక ఎన్నికల షెడ్యూలుకు ముందే నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిల పేరుతో అభ్యర్థులను ప్రకటిస్తూ తాము ముందజలో ఉన్నామని చెప్పుకుంటున్న వైసిపికి కొత్త తలనొప్పులు వచ్చి పడుతున్నాయి. తెలంగాణ ఫలితాలను చూసిన తరువాత సిట్టింగ్ ఎమ్మెల్యేలలో ప్రజా వ్యతిరేకతతో ఉన్న వారిని మార్చాలని వైసిపి అధిష్టానం ఇప్పటికే నిర్ణయించింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలువురు సిట్టింగ్‌లకు జంబ్లింగ్ పద్ధతిని పాటించింది. మరికొంత మందికి ఈ సారికి సీటు ఇవ్వలేమని మొండి చేయిచూపారు. ఇప్పటికే ప్రకటించిన అభ్యర్థులకు కూడా అసమ్మతి వెంటాడుతోంది. మంత్రి మేరుగ నాగార్జునకు సంతనూతలపాడులో అవకాశం ఇవ్వగా ఆయనకు అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే సుధాకర్ బాబు నుంచి సహకారం కొంవడింది. సత్తెనపల్లిలో మంత్రి అంబటి రాంబాబుకు వ్యతిరేకంగా అసమ్మతి కార్యకలాపాలు ఊపందుకుంటున్నాయి. గుంటూరు తూర్పు నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా ప్రకటించిన ఎమ్మెల్యే ముస్తాఫా కుమార్తెకు కూడా అసమ్మతి సెగ తగిలింది. ఆమెకు వ్యతిరేకంగా డిప్యూటీ మేయర్ సజీల, ఆమె తండ్రి షౌకత్, ఇతర నాయకులు కలిసి భేటి అయ్యారు. తూర్పు నియోజకవర్గంలో వైసిపిలోని సీనియర్లు ఎంత వరకు సహకరిస్తారన్నదీ చర్చనీయాంశంగా మారింది. పత్తిపాడులో ఇన్‌ఛార్జిగా ఎంపిక అయిన బాలసాని కిరణ్‌తో కూడా నాయకులు మమేకం కాలేకపోతున్నారు. ఆయన కూడా ఇంకా పూర్తిగా నియోజకవర్గంపై దృష్టిసారించలేదు. చిలకలూరిపేటలో మల్లెల రాజేష్ నాయుడుకు కూడా ప్రస్తుతం ఒంటరి పోరాటం చేస్తున్నారు. టిడిపి బాగా పట్టున్న ఈనియోజకవర్గంలో మాజీ మంత్రి పుల్లారావును ఎదుర్కొంనేందుకు మల్లెల రాజేష్ సరితూగగలరా లేదా అన్న అంశంపై వైసిపి ఐ ప్యాక్ మళ్లీ సర్వే చేస్తున్నట్టు తెలిసింది. గతంలో ఆయనకు పుల్లారావుతో ఉన్న సాన్నిహిత్యం వల్ల కొంత మంది వైసిపి నాయకులు అంటీ ముట్టన్నట్టు వుంటున్నారు. తాడికొండలో పత్తిపాడు ఎమ్మెల్యే సుచరిత విస్తృత పర్యటనలు చేస్తున్నారు. ఆమె నియోజకవర్గం బాధ్యతలు స్వీరించిన వెంటనే సామాజిక సాధికార బస్సు యాత్రను సమర్ధవంతంగా నిర్వహించినా ఈ నియోజక వర్గంలో కూడా గ్రూపు రాజకీయాలు ఆమెను ఇబ్బందిపేట్టే పరిస్థితి నెలకొంది. ఎంపి లావు కృష్ణదేవరాయులును మార్చి నర్సరావుపేట లోక్‌సభకు బిసితరగతికి చెందిన నాగార్జుననుఎంపిక చేయడానికి పల్నాడు జిల్లాలో మెజార్టీ ఎమ్మెల్యేలు వ్యతిరేకించినట్టు తెలిసింది. కృష్ణదేవరాయులును నర్సరావుపేట ఎంపి అభ్యర్థిగా కొనసాగించాలని నలుగురు ఎమ్మెల్యేలు అధిష్టానంపై వత్తిడి తెచ్చినా ఫలితం లేదు. గుంటూరు ఎంపిగా వైసిపికి అభ్యర్థుల కొరత ఏర్పడింది. లావు కృష్ణదేవరాయులును గుంటూరు నుంచి పోటీ చేయాలని కోరినా ఆయన విముఖత వ్యక్తం చేశారు. దీంతో గుంటూరు ఎంపిగా మరోసారి మోదుగుల వేణుగోపాలరెడ్డికి లేదా సినీనటుడు ఆలీకి అవకాశం ఇవ్వాలని అధిష్టానం యోచిస్తోంది. అంబటి రాయుడు అర్థాంతర నిష్క్రమణతో వైసిపికి ఎంపి అభ్యర్థుల దొరకడం కష్టంగా మారింది. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్యను తిరిగి ఎంపిక చేస్తే కొంత మంది పార్టీని వీడతారని ప్రచారం జరుగుతోంది. రోశయ్యకు అవకాశం ఇవ్వకపోతే ఆయనకూడా పార్టీ మారతారోమోన్న ప్రచారం కూడా జరుగుతోంది. రోశయ్య కొనసాగింపు వ్యవహారం వైసిపికి కత్తిమీద సాములా మారింది. మంగళగిరిలో పార్టీ ఇన్‌ఛార్జికి ఒకవర్గం నాయకులు సహకరించడంలేదని అంటీముట్టన్నట్టు ఉంటున్నట్టు తెలిసింది. రేపల్లెలో ఈపూరు గణేష్ ఎంపిక కూడా ఎంపి మోపిదేవీ వెంకట రమణకు ఇష్టం లేదు. గణేష్‌కు మోపిదేవి వర్గం ఎంత వరకు సహకరిస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

**(ఎ.వి.డి.శర్మ)**